
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



అత్యాచార కేసులో 20 ఏళ్ల జైలు శిక్ష

- సంచలన తీర్పునిచ్చిన కర్నూలు పోక్సో కోర్టు
- బాలికకు రూ.2లక్షల నష్టపరిహారం



షేక్షావలిని జైలుకు తీసుకెళ్తున్న పోలీసులు

కర్నూలు లీగల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక మహావీర్ నగర్‌లో బాలికపై అత్యాచారం చేసిన కేసులో ఓ ముద్దాయికి 20 సంవత్సరాల కారాగార శిక్ష, రూ.10వేలు జరిమానా విధిస్తూ కర్నూలు సెషన్ పోక్సో కోర్టు న్యాయాధికారి భూపాల్ రెడ్డి గురువారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు బాధిత బాలిక(14) తన తల్లి, చెల్లితో పాటు స్థానిక మహావీర్‌నగర్‌లో ఉంటోంది. 2021 ఆగస్టు నెలలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో అదే వీధికి చెందిన నిందితుడు షేక్షావలి ఆమె ఇంట్లో అక్రమంగా ప్రవేశించి కత్తితో బెదిరించి అత్యాచారం చేశాడు. ఈ విషయం ఎవరికైనా చెబితే చంపేస్తానని నిందితుడు ఆ బాలికను బెదిరించడంతో ఆమె ఎవరికీ చెప్పలేదు. ఇలాగే ఆ షేక్షావలి బాలికను భయభ్రాంతులకు గురి చేసి పలుమార్లు అత్యాచారానికి ఒడిగట్టాడు. భయంతో ఈ విషయాన్ని ఎవరికి చెప్పకుండా ఆ బాలిక కొద్దిరోజులుగా ముభావంగా ఉండటంతో గమనించిన బాలిక తల్లి కారణం అడగడంతో బాలిక జరిగిన విషయాన్ని తన తల్లికి తెలియజేసింది. దీంతో బాలిక తల్లి కర్నూలు మహిళా పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు ముద్దాయి షేక్షావలిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. ఆ తర్వాత అప్పటి మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ బి.వెంకట్రామయ్య కేసును దర్యాప్తు చేసి కోర్టులో చార్జ్‌షీటు దాఖలు చేశారు. కోర్టులో నేరం రుజువు కావడంతో 20 సంవత్సరాల కారాగార శిక్షతో పాటు రూ.10వేల జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారు. బాధితురాలికి జరిమానా మొత్తంతో పాటు పోక్సో చట్టంలో పేర్కొన్న మేరకు రూ.2 లక్షలను నష్టపరిహారంగా ప్రభుత్వం చెల్లించాలని న్యాయాధికారి తీర్పులో పేర్కొన్నారు.

పోలీసులను అభినందించిన ఎస్పీ

ముద్దాయికి శిక్ష పడేందుకు కృషి చేసిన అప్పటి మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ బి. వెంకట్రామయ్యను పబ్లిక్ ప్రాసిక్యూటర్లు వెంకటేశ్వరరెడ్డి, ప్రకాష్ రెడ్డిలను ఎస్పీ బిందుమాధవ్ అభినందించారు. మహిళలు, చిన్న పిల్లలపై లైంగికంగా వేధించే వారికి కోర్టు తీర్పు ఒక గుణపాఠం కావాలని ఆయన పేర్కొన్నారు.

ఉమ్మడి జిల్లాలో విజిలెన్స్ తనిఖీలు

కర్నూలు క్రైం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాలో విజిలెన్స్ అధికారులు విస్తృత తనిఖీలు చేపట్టారు. విజిలెన్స్ ఎస్పీ చౌడేశ్వరి ఆధ్వర్యంలో ఈ తనిఖీలు చేశారు. నందికొట్కూరు సీఎస్‌డీటీ ఆధ్వర్యంలో జూపాడుబంగ్లా మండలం తాటిపాడు గ్రామంలో రేషన్ దుకాణం తనిఖీ చేశారు. 19 క్వింటాళ్ల రేషన్ బియ్యం తేడా ఉన్నట్లు గుర్తించారు. కర్నూలు రాజధాని బార్ అండ్ రెస్టారెంటులో జాయింట్ ఇన్‌స్పెక్టర్, ఫుడ్ సేఫ్టీ అధికారుల ఆధ్వర్యంలో తనిఖీలు చేశారు. పలు ఆహార పదార్థాల శాంపుల్స్‌ను సేకరించి ల్యాబ్‌కు పంపారు. నంద్యాల, కోవెలకుంట్ల పరిసర ప్రాంతాల్లో వాహనాలు తనిఖీలు చేశారు. వివిధ మైనింగ్‌తో వెళ్తున్న వాహనాలు తనిఖీ చేయగా.. ఓవర్‌లోడుతో ఉన్నట్లు గుర్తించారు. ఈవాహనాలపై రూ.9.77లక్షలు జరిమానా విధించేందుకు రవాణా శాఖ అధికారులకు అప్పగించారు. నందికొట్కూరులో పలు టిఫిన్ సెంటర్లను తనిఖీ చేశారు. గృహ వినియోగ సిలిండర్లు, వాణిజ్య అవసరాలకు వాడుతున్నట్లు గుర్తించి 12 సిలిండర్లు సీజ్ చేశారు. వీరిపై 6ఏ కేసులు నమోదు చేశారు.

ఎటూ తేలని నీరు - చెట్టు లెక్కలు



మండలం కేంద్రం ఆస్పరి గ్రామం ముల్లవాగు ఇది. ఇక్కడ నీరు-చెట్టు కింద పూడిక తీత, జంగిల్ క్లియరెన్స్ పనులు చేసినట్లు చూపించి బిల్లులు కూడా అప్‌లోడ్ చేశారు.

రాష్ట్ర విభజన తరువాత అప్పటి టీడీపీ ప్రభుత్వం నీరు-చెట్టు పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా చేపట్టింది. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ పథకంలో అక్రమాలు జరిగాయని విజిలెన్స్ విచారణ పేరిట బిల్లులు ఆపేసింది. న్యాయస్థానాన్ని ఆశ్రయించిన కాంట్రాక్టర్లకు కొంత వరకు బిల్లులు చెల్లించింది. మళ్లీ టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక నీరు-చెట్టు బిల్లులపై దృష్టి సారించింది. రాష్ట్ర వ్యాప్తంగా రెండు విడుతల్లో రూ.584 కోట్లు విడుదల చేస్తే.. ఉమ్మడి కర్నూలు జిల్లాకు దాదాపుగా రూ.90 కోట్లు ఇచ్చారు. ఈ బిల్లులు క్లియర్ చేయాలనే కృత నిశ్చయంతో ఉన్న ప్రభుత్వం ఈ నెల 31లోగా లెక్కలు తేల్చాలని, పెండింగ్ బిల్లులు అప్‌లోడ్ చేయాలని, ఆ తరువాత వచ్చే బిల్లులు పరిగణలోకి తీసుకోమని ప్రభుత్వం తేల్చేసింది.

- కూటమి ప్రభుత్వం వచ్చాక రూ.90 కోట్ల చెల్లింపు
- కోర్టుకు వెళ్లిన వారికే బిల్లులు
- 31లోగా లెక్కలు తేల్చి డిక్లరేషన్ ఇవ్వాలని ఆదేశం
- ఆ తరువాత వచ్చే బిల్లులు పరిగణలోకి తీసుకోరు
- బిల్లులు అప్‌లోడ్ చేసేందుకు కుస్తీ పడుతున్న ఇంజనీర్లు
- కర్నూలు జిల్లాలో అక్రమాలపై విజిలెన్స్ విచారణ

కర్నూలు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా జలవనరుల శాఖ కర్నూలు సర్కిల్ పరిధిలోకి తుంగభద్ర దిగువ కాలువ (టీబీపీ ఎల్లెల్సీ) డివిజన్, కేసీ కెనాల్ నంద్యాల డివిజన్, ప్రొటెక్షన్ వర్క్ డివిజన్, మైనర్ ఇరిగేషన్ (ఎంఐ) కర్నూలు, నంద్యాల డివిజన్లు పరిధిలో గత టీడీపీ ప్రభుత్వంలో నీరు-చెట్టు పనులు చేశారు. భూగర్భ జలాలు పెంపు, నీటి వనరుల సంరక్షణ లక్ష్యంగా 2014-15 నుంచి 2018-19 వరకు కర్నూలు ఇరిగేషన్ సర్కిల్ పరిధిలో ఆయా డివిజన్లలో దాదాపు రూ.1,421.31 కోట్లు విలువైన 14,345 పనులను మంజూరు చేసి పరిపాలన, సాంకేతిక అనుమతులు ఇచ్చారు. చెక్ డ్యాంలు నిర్మాణం, చెరువులు, వంకలు, వాగులు, కాలువల్లో పూడికతీత (డీసిల్టింగ్), జంగిల్ క్లియరెన్స్ వంటి పనులు చేపట్టారు. దాదాపు రూ.580 కోట్లు ఖర్చు చేశారు. 2019 మేలో జగన్ సారథ్యంలో వైసీపీ ప్రభుత్వం వచ్చాక పనులు ఆపేయడంతో పాటు ఈ పనుల్లో భారీగా అవినీతి అక్రమాలు జరిగాయని, విజిలెన్స్ విచారణ పేరుతో బిల్లులు చెల్లింపులు నిలిపివేశారు. బిల్లులు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయకుండా హెడ్ ఆఫ్ అకౌంట్ క్లోజ్ చేసింది. ఇప్పటి వరకు సుమారుగా రూ.280 కోట్లు బిల్లులు చెల్లించినట్లు తెలుస్తోంది. అందులో కూటమి ప్రభుత్వం వచ్చాకే రూ.90 కోట్లు చెల్లించారు. కోర్టుకు వెళ్లిన వారికే బిల్లులు ఇచ్చారు. ముప్పాతి శాతం టీడీపీ సానుభూతిపరులైన కాంట్రాక్టర్లకు బిల్లులు రాక ఆర్థికంగా నష్టపోయారు. పలువురు కాంట్రాక్టర్లు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడులను కలసి తమ ఆవేదన వ్యక్తం చేశారు.



జలమండలి కార్యాలయం

మిగతా 6వ పేజీలో



లోకేశ్ పాదయాత్రతో భరోసా

- ఓర్వకల్లుకు భారీ పరిశ్రమలు, ప్రాజెక్టులు
- టీడీపీ జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి
- ఘనంగా నారా లోకేశ్ జన్మదిన వేడుకలు

వివరాలు 7లో...

నారా లోకేశ్ జన్మదినం సందర్భంగా కర్నూలులో కేక్ కట్ చేస్తున్న జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యే కేఈ శ్యామ్‌బాబు, టీడీపీ నేతలు తుగ్గలి నాగేంద్ర, రాఘవేంద్ర రెడ్డి తదితరులు

మిథ్యగా ఇంటర్ విద్య





- అరకొర సౌకర్యాల మధ్య చదువులు
- ఇన్‌చార్జి అధికారులతో కుంటుపడిన పాలన
- కాంట్రాక్ట్ అధ్యాపకులతోనే బోధన
- ఇప్పటికీ అందని ఉర్దూ మీడియం పాఠ్యపుస్తకాలు
- దగ్గర పడుతున్న పరీక్షలు
- ఆందోళనలో విద్యార్థులు

అరకొర వసతుల మధ్య ఈ ఏడాది ఇంటర్ విద్య ముగుస్తోంది. కాంట్రాక్ట్ అధ్యాపకులు, ఉర్దూ మీడియం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందకపోవడంతో తూతూ మంత్రంగా చదువు సాగిపోయింది. ఫిబ్రవరి ఒకటో తేదీన ఎథిక్స్ మానవీయ విలువలు 3వ తేదీన పర్యావరణ విద్య పరీక్షతోపాటు ఇంటర్ సైన్స్ ప్రాక్టిల్ పరీక్షలు ఇదే నెల 5వ తేదీన ఒకేషన్‌ల్ కోర్సులకు, 10వ తేది నుంచి జనరల్ కోర్సులకు పరీక్షలు జరగనున్నాయి. మార్చి ఒకటో తేదీన ఇంటర్ ప్రథమ సంవత్సరం, 2వ తేదీన ద్వితీయ సంవత్సరం పబ్లిక్ పరీక్షలు ప్రారంభమవుతాయి. జిల్లాలో ప్రభుత్వ, ఎయిడెడ్ రెసిడెన్షియల్, ప్రైవేటు జూనియర్ కళాశాలలు 165 ఉన్నాయి. వీటిలో 46,335 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇందులో 26 ప్రభుత్వ కళాశాలలు, నాలుగు ఎయిడెడ్ కాగా, మిగతావి రెసిడెన్షియల్ ప్రైవేటు కళాశాలలు ఉన్నాయి.


కర్నూలు ఎడ్యుకేషన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): విద్యా సంవత్సరం పూర్తి కావస్తున్నా ఇంటర్మీడియట్‌లో ఉర్దూ మీడియం గ్రూపు విద్యార్థులకు గత ఆరేడు సంవత్సరాల నుంచి పాఠ్యపుస్తకాలను సరఫరా చేయలేదు. ఎమ్మిగనూరు, కర్నూలు కేవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, కర్నూలు ప్రభుత్వ మైనార్టీ జూనియర్ కళాశాలలో దాదాపు వెయ్యి మంది విద్యార్థులు ఉర్దూ మీడియం చదువుతున్నారు. ఉర్దూ మీడియం బోధించే అధ్యాపకులు ఇచ్చిన నోట్స్‌పైనే ప్రిపరేషన్ అయి పరీక్షలు రాయాల్సి ఉంది. పాఠ్యపుస్తకాలు లేకపోవడంతో ఉర్దూ మీడియం విద్యార్థులు పరీక్షలు ఎలా రాయాలోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నిర్లక్ష్యం ఉర్దూ మీడియం విద్యార్థులకు శాపంగా మారింది.

నియామకాలను మరిచారు..

గత కొన్ని సంవత్సరాల కిందట కర్నూలు జిల్లాకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలను ప్రభుత్వం మంజూరు చేసింది. బోధన, బోధనేతర సిబ్బంది పోస్టులను భర్తీ చేయడాన్ని విస్మరించడంతో పేద విద్యార్థులకు సరైన విద్య అందడం లేదు. జిల్లాలోని ఎమ్మిగనూరు, కర్నూలుకు మైనార్టీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలు మంజూరయ్యాయి. వీటిల్లో ప్రిన్సిపాల్ పోస్టు, లెక్చరర్స్, నాన్ టీచింగ్ స్టాఫ్‌ను నియమించలేదు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేసే సీనియర్ అధ్యాపకులకు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్స్ బాధ్యతలను అప్పగించారు. కాంట్రాక్ట్ విధానం ద్వారా బోధన, బోధనేతర సిబ్బందిని నియమించారు.

ఎయిడెడ్ కళాశాలలు అధ్వానం

జిల్లాలో ఎయిడెడ్ కళాశాలల పరిస్థితి అధ్వానంగా ఉంది. ఈ కళాశాలల్లో బోధన, బోధనేతర సిబ్బంది కొరత వేధిస్తోంది. జిల్లాలో నాలుగు ఎయిడెడ్ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ఇందులో 1500 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఖాళీ ఏర్పడిన పోస్టుల స్థానాల్లో కొత్త నియామకాలు చేపట్టకపోవడంతో బోధన, బోధనేతర సిబ్బంది లేక ఖాళీ అవుతున్నాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో కాంట్రాక్ట్ అధ్యాపకులను నియమిస్తోంది. అయితే ఎయిడెడ్ కళాశాలల్లో కాంట్రాక్ట్ అధ్యాపకులను నియమించకపోవడంతో అడ్మిషన్ల సంఖ్య లేక కళాశాలలు వెలవెలపోతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఎయిడెడ్ కళాశాలలపై సవతి తల్లి ప్రేమ చూపుతోందనే విమర్శలు ఉన్నాయి. ఉన్న విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదు.



కాంట్రాక్ట్ అధ్యాపకులే గతి

జిల్లాలోని ప్రభుత్వ కళాశాలల్లో అధ్యాపకుల కొరత వేధిస్తోంది. జిల్లాలో ప్రభుత్వం మంజూరు చేసిన పోస్టుల్లో 70 శాతం ఖాళీగా ఉన్నాయి. వీటిని భర్తీ చేయడంలో ప్రభుత్వం కాలయాపన చేస్తోంది. జిల్లాలో రెగ్యులర్ లెక్చరర్స్ 190 మంది మాత్రమే ఉన్నారు. దీంతో కాంట్రాక్ట్ అధ్యాపకులు, రీడిప్లాయిడ్ లెక్చరర్స్ మినిమమ్ టైం స్కేల్ అధ్యాపకులు, గెస్ట్ ఫ్యాకల్టీతో ఇంటర్ విద్యను నెట్టుకొస్తున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రతి ఏడాది లెక్చరర్ ఖాళీలు పెరుగుతూనే ఉన్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదు. ఫలితంగా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలు అడ్మిషన్లు లేక మూతకు సిద్ధంగా ఉన్నాయి. మరికొన్ని కళాశాలల్లో కొన్ని గ్రూపులను ఎత్తివేస్తున్నారు.

ఇన్‌చార్జిల పాలనలో ఇంటర్ విద్య

కర్నూలు జిల్లాలో గత 10 సంవత్సరాల నుంచి డీవీఈవో, ఆర్ఐవో పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇన్‌చార్జి పాలనతో నెట్టుకొస్తున్నాయి. నందికొట్కూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్న వై. పరమేశ్వరరెడ్డికి డీవీఈవోగాను, ఓర్వకల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌కు ఆర్ఐఓ అధికారిగా ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించారు. ఈ కళాశాలపై పర్యవేక్షణ కరువైంది. దీంతో ఇంటర్ విద్యపరిపాలన గాడి తప్పింది. వీరు రెండు పదవులకు న్యాయం చేయలేకపోతున్నారనే విమర్శలు ఉన్నాయి. దీంతో ప్రైవేటు జూనియర్ కళాశాలలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇంటర్మీడియట్ బోర్డు పర్యవేక్షణాధికారులను నియమించడంలో తీవ్ర జాప్యం చేస్తోందనే వాదనలు వినిపిస్తున్నాయి.



అధ్యాపకులకు శిక్షణ తరగతులు ఏవీ..?

జిల్లాలో అన్ని జూనియర్ కళాశాలల్లో పని చేస్తున్న లెక్చరర్స్‌కు ఆయా సబ్జెక్టలలో నిష్ణాతులైన సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్‌చే శిక్షణ కార్యక్రమాలు నిర్వహించే వారు. అయితే గత రెండు సంవత్సరాల నుంచి శిక్షణ కార్యక్రమాలకు దూరమయ్యారు. ఈ ఓరియంటేషన్ ప్రోగ్రామ్‌తో సిలబస్‌లో మార్పులు, చేర్పులు షార్ట్ మెథడ్‌తో విద్యార్థులకు ఎలా బోధించాలో ఈ శిక్షణలో మెలకువలు నేర్పించేవారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను తరగతి గదిలో విద్యార్థులకు సులభరీతిలో బోధించడంతో సాధారణ విద్యార్థులు ఉత్తీర్ణులయ్యేవారు. ఈ సారి శిక్షణ కార్యక్రమానికి అధ్యాపకులు దూరం అయ్యారు.

హైకోర్టు బెంచ్ సాధన కమిటీ ఏర్పాటు

కర్నూలు లీగల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): కర్నూలులో హైకోర్టు బెంచ్‌ను ఏర్పాటు చేసే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు హైకోర్టు బెంచ్ సాధన కమిటీని ఏర్పాటు చేసినట్లు కర్నూలు జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి బీఎస్ రవికాంత్ ప్రసాద్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు బార్ అసోసియేషన్ అత్యవసర కార్యవర్గ సమావేశాన్ని ఏర్పాటు చేసి తీర్మానం చేసినట్లు తెలిపారు. కమిటీ చైర్మన్‌గా బి.కృష్ణమూర్తి, వైస్ చైర్మన్‌గా బీఎస్ రవికాంత్ ప్రసాద్, కన్వీనర్‌గా కె.కపిలేశ్వరయ్య, కోకన్వీనర్‌గా దాసెట్టి శ్రీనివాసులు, ఎక్స్ అఫిషియో సభ్యుడిగా పి.రవి గువేరా, సభ్యులుగా శివరామయ్య, రామసుబ్బారెడ్డి, పి.నాగేంద్రనాథ్, ఎంఎల్. శ్రీనివాసరెడ్డి, ఎస్.చాంద్‌బాషా, జి.విజయకుమార్, బి.మురళి మనోహర్, ఎంబీవీ జోగయ్యశర్మ, కె.రంగనాథ్, వి.నాగలక్ష్మీదేవి, పి.నిర్మల, కె.మోహన్‌బాబు, కేఈ జగదీష్ కుమార్, సుమనారాణి, పీవీ శ్రీనివాసులు, ఎస్ఏ ఇందుమతి వ్యవహరిస్తారని తెలిపారు.

వైసీపీ కీలక నేతలపై ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదు

ఎమ్మిగనూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరుకు చెంది న వైసీపీ కీలక నేతలపై పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదయ్యాయి. గత ఏడాది డిసెంబరు 15వ తేదీన వైసీపీ నాయకులు పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో సాగునీటి ఎన్నికల సందర్భంగా మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డిని పోలీస్ అధికారి అవమానకరంగా మాట్లాడారని, క్షమాపణ చెప్పాలని ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వైసీపీ నాయకులకు బందోబస్తు పర్యవేక్షిస్తున్న పట్టణ ఎస్ఐ డాక్టర్ నాయక్‌కు మధ్య వాగ్వివాదం, ఘర్షణ చోటు చేసుకుంది. ఈ ఘటనపై పట్టణ ఎస్ఐ డాక్టర్ నాయక్ పట్టణ పోలీసులకు ఈ నెల 12వ తేదీన ఫిర్యాదు చేశాడు. దీంతో వైసీపీకి చెందిన కీలక నేతలు మాజీ ఎమ్మెల్యే అల్లుడు బీఆర్ బసిరెడ్డి, మున్సిపాల్ వైస్ చైర్మన్ నజీర్ ఆహ్మద్, టౌన్ బ్యాంక్ మాజీ చైర్మన్ కొమ్మురాజు, మాజీ ఎంపీ బుట్టా రేణుక పీఏ రవి, నందవరం మండల వైసీపీ అధ్యక్షుడు శివారెడ్డి గౌడ్, సోగునూరు బీమిరెడ్డి, ఎంపీపీ కేశన్న, సునీల్‌పై కేసులు నమోదైనట్లు తెలిసింది. వీళ్లంతా ఈ నెల 25వ తేదీన ఎస్‌డీపీవో కార్యాలయానికి కానీ, కర్నూలులోని ఎస్సీ, ఎస్టీ కోర్టుకుగానీ హాజరు కావాలని నోటీసులు వచ్చాయి.

కంది రైతులను నిరాశ ఆవరించింది. ఉమ్మడి జిల్లాలో దాదాపు లక్షన్నర ఎకరాల్లో కంది పంటను సాగు చేశారు. ప్రభుత్వం క్వింటానికి మద్దతు ధర రూ.7,550 ప్రకారం రైతుల నుంచి కొనాలని నిర్ణయించింది. నవంబరు, డిసెంబరు నెలల్లో బహిరంగ మార్కెట్‌లోనే క్వింటం కందులు రూ.9వేల నుంచి రూ.10వేల దాకా అమ్ముడుపోయింది. మార్క్‌ఫెడ్ సంస్థ కొనుగోలు ప్రారంబిస్తే ఈ ధర మరింత పెరుగుతుందని రైతులు ఆశించారు. అయితే అధికారులు కాలయాపన చేయడంతో వ్యాపారులు క్వింటం కందులను బహిరంగ మార్కెట్‌లో రూ.8వేలకే కొంటున్నారు. దాదాపు 80 శాతం పంట దిగుబడిని రైతులు కర్నూలు, ఇతర మార్కెట్ యార్డుల్లో తక్కువ ధరకే అమ్మేశారు. మార్క్‌ఫెడ్ సంస్థ మాత్రం కర్నూలు జిల్లాలో 9వేల మెట్రిక్ టన్నులు, నంద్యాల జిల్లాలో 8వేల మెట్రిక్ టన్నులు మాత్రమే రైతుల నుంచి కేంద్రం ప్రకటించిన మద్దతు ధరకు కొనడానికి నిర్ణయించుకుంది. మొదట్లో ఈ సంస్థ అధికారులు కర్నూలు జిల్లాలో 56వేల మెట్రిక్ టన్నులు, నంద్యాల జిల్లాలో 43వేల మెట్రిక్ టన్నులు రైతుల నుంచి కొనుగోలు చేయాలని నిర్ణయించారు. ఈ నిర్ణయం నవంబరులోనే మార్క్‌ఫెడ్ ప్రకటించినా ఎప్పటికప్పుడు వాయిదా వేస్తూ వచ్చింది. దీంతో బహిరంగ మార్కెట్‌లో పంట దిగుబడి అమ్ముకొని రైతులు నష్టపోయారు.


కర్నూలు మార్కెట్‌లో వ్యాపారులకు విక్రయించేందుకు భారీగా రైతులు తెచ్చిన కందులు


కంది రైతుల కష్టాలు పట్టవా..?

- నిధులు లేని మార్క్‌ఫెడ్
- కొరవడిన శాఖల సమన్వయం
- నాఫెడ్ నుంచి సకాలంలో అందని నిధులు
- కందుల సేకరణలో భారీ కోత
- మొదట్లో లక్ష మెట్రిక్ టన్నుల కొనుగోలుకు నిర్ణయం
- తాజాగా 17వేల మెట్రిక్ టన్నులకే పరిమితం
- ఉమ్మడి జిల్లాలో ప్రతి మండల కేంద్రంలో కొనుగోలు కేంద్రం

కర్నూలు అగ్రికల్చర్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కంది పంట సాగు ప్రధానంగా రాయలసీమలోనే ఎక్కువ. అనంతపురంతో పాటు కర్నూలు, నంద్యాల జిల్లాలో దాదాపు 5 లక్షల ఎకరాల్లో ఈ పంటను రైతులు సాగు చేస్తున్నారు. పంట సాగుకు పెట్టుబడి ఖర్చులు ఎక్కువగా ఉండవనే ఉద్దేశంతో రైతులు కంది పంట సాగుపైనే ఇటీవల కాలంలో శ్రద్ధ చూపుతున్నారు. గత సంవత్సరం క్వింటం కందులకు 8 నుంచి 10వేలకు పైగా ధర లభించడంతో ఈసారి పెద్ద ఎత్తున కంది సాగు చేశారు. అయితే.. రైతుల నుంచి పెద్దఎత్తున కందుల కొనుగోలుకు మొదట్లో సిద్ధమైన కేంద్ర సంస్థ నాఫెడ్ నుంచి అరకొరగానే కొనుగోలుకు అనుమతులు రావడంతో మార్క్‌ఫెడ్ సంస్థ సొంతంగా నిధులు సమకూర్చుకుని రైతుల నుంచి కందుల కొనుగోలుకు సిద్ధం కాలేని పరిస్థితులు నెలకొన్నాయి. ధాన్యం సేకరణకు వివిధ ఆర్థిక సంస్థల నుంచి రూ.6వేల కోట్ల అప్పు తెచ్చిన మార్క్‌ఫెడ్ రైతులకు సకాలంలో వారి బ్యాంకు ఖాతాలకు డబ్బులు జమ చేసింది. అయితే.. అదే స్థాయిలో రాయలసీమలో కంది రైతుల నుంచి వాటిని కొనుగోలు చేసేందుకు మాత్రం ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఆ సంస్థ అధికార వర్గాలు తెలిపాయి. రాష్ట్ర వ్యాప్తంగా కేంద్రం ప్రకటించిన మద్దతు ధరపై కందుల కొనుగోలుకు రూ.100 కోట్లు అవసరమని అంచనా. ఈ నిధుల కోసం గత రెండు నెలలుగా సంస్థ అధికారులు ఆర్థిక శాఖ ఆమోదం కోసం కుస్తీలు పడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ పరిస్థితుల్లో నిధులు లేకపోవడంతో నాఫెడ్ ఆమోదించిన మేరకు తక్కువ మొత్తంలో రైతుల నుంచి కందుల కొనుగోలు చేసేందుకు మార్క్‌ఫెడ్ సంస్థ సిద్ధమవుతున్నది. ఒక్క ఉమ్మడి కర్నూలు జిల్లాలోనే లక్ష మెట్రిక్ టన్నుల కందులు కొనుగోలు చేస్తామని రెండు నెలల కిందటే మార్క్‌ఫెడ్ సంస్థ అధికారులు ప్రకటించినా చివరకు నిధుల లేమితో కేంద్ర సంస్థ నాఫెడ్ ఆమోదంతో కేవలం రెండు జిల్లాలో 17వేల మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

నాఫెడ్ నిధులు ఎప్పుడు వస్తాయో..

గతంలో మొక్కజొన్నలు రైతుల నుంచి మార్క్‌ఫెడ్ సంస్థ ద్వారా సేకరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అయితే మార్క్‌ఫెడ్ సంస్థకు కేంద్ర సంస్థ నాఫెడ్ నుంచి నిధులు పెద్ద ఎత్తున అందకపోవడంతో దాదాపు ఆరు నెలల జాప్యంతో మొక్కజొన్నలు విక్రయించిన రైతుల ఖాతాల్లో డబ్బు జమ చేసింది. తాజాగా కందుల విషయంలోనూ అదే పరిస్థితిని ఎదుర్కోవాల్సి వస్తుందేమోనని మార్క్‌ఫెడ్ సంస్థ అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నాఫెడ్ సంస్థ నుంచి త్వరితగతిన రైతుల నుంచి సేకరించిన కందులకు డబ్బులు విడుదల చేస్తే ఏ ఇబ్బందులు ఉండవని, లేకపోతే రైతుల నుంచి పెద్ద ఎత్తున నిరసన ఎదుర్కోవాల్సి వస్తుందేమోనని వారు ఆందోళన చెందుతున్నారు.



శాఖల మధ్య సమన్వయం ఏదీ..?

పక్క రాష్ట్రం కర్ణాటకలో రైతుల నుంచి సేకరించే కందులపై క్వింటానికి రూ.450 బోనస్ ఇస్తోంది. అదే విధంగా తెలంగాణలో వరి రైతులకు క్వింటానికి రూ.500 బోనస్ ఇస్తోంది. అదే విధంగా రాయలసీమలో పెద్ద ఎత్తున కందులను పండించే రైతులను కూడా ప్రోత్సహించేందుకు కర్ణాటక రాష్ట్రం మాదిరి క్వింటానికి రూ.450 బోనస్ ఇవ్వాలని రైతు సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో క్వింటం కంది ధర రూ.8వేల దాకా ఉంది. కేంద్రం ప్రకటించిన మద్దతు ధర కేవలం రూ.7,550 మాత్రమే. ఈ పరిస్థితుల్లో రైతులు మార్క్‌ఫెడ్ సంస్థకు కందులు విక్రయించేందుకు ఏ మాత్రం సుముఖత వ్యక్తం చేయడం లేదు. అదే విధంగా డబ్బులు కూడా వెంటనే అందించే అవకాశం లేదని, నెలల తరబడి జాప్యం చేస్తే తమకు నష్టం తప్ప ఏ మాత్రం ప్రయోజనం ఉండదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అందువల్లనే ఉమ్మడి కర్నూలు జిల్లాలో బుధవారం నుంచే కందుల కొనుగోలుకు విక్రయ కేంద్రాలకు చర్యలు చేపట్టినా రైతులు మాత్రం ఆ వైపు చూడటం లేదు.

కందుల కొనుగోలుకు ఏర్పాట్లు షురూ

ఉమ్మడి కర్నూలు జిల్లాలో రైతుల నుంచి రూ.17వేల మెట్రిక్ టన్నులు కొనడానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. బుధవారం నుంచే రైతులు తమ వివరాలను రైతు సలహా కేంద్రాల్లో నమోదు చేయించాలని విజ్ఞప్తి చేశాం. రైతుల నుంచి పూర్తి స్థాయిలో వివరాలు అందగానే కొనుగోలు కేంద్రాల ద్వారా కందులను కొంటాం. కేంద్ర సంస్థ నాఫెడ్ ఈసారి నిధులను వెంట వెంటనే విడుదల చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టనుంది. రైతులు ఆందోళన చెందనవసరం లేదు.

-రాజు, మార్క్‌ఫెడ్, డీఎం



నేడు మార్కెటింగ్ శాఖ జేడీ రాక

రైతులకు వసతులు, సెస్సు వసూళ్లపై దిశా నిర్దేశం

కర్నూలు అగ్రికల్చర్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఈసారి ఖరీఫ్, రబీ సీజన్లలో పంట దిగుబడులు గతంలో కంటే రైతులకు అధిక మొత్తంలో అందాయి. అదే విధంగా పంట ఉత్పత్తులకు ధరలు కూడా మద్దతు ధరకు మించి అందుతుండటం వల్ల వ్యాపారుల నుంచి మార్కెటింగ్ శాఖకు రావాల్సిన సెస్సు ఆదాయాన్ని రాబట్టేందుకు ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందులో భాగంగా రాయలసీమ మార్కెటింగ్ శాఖ జేడీ రామాంజనేయులు సెస్సు వసూళ్లతో పాటు మార్కెట్ యార్డుల్లో రైతులకు అవసరమైన వసతుల ఏర్పాట్లపై చర్చించేందుకు ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 15 మార్కెట్ కమిటీల సెక్రటరీలతో శుక్రవారం అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ప్రధానంగా పంట ఉత్పత్తుల క్రయవిక్రయాలు జరిగే కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు మార్కెట్ యార్డులో పంట ఉత్పత్తుల విక్రయాల్లో రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకునేలా మార్కెట్ కమిటీల సెక్రటరీలకు ఆదేశాలు జారీ చేయనున్నట్లు సమాచారం. అదే విధంగా పెద్ద ఎత్తున ఈ రెండు జిల్లాలో వ్యాపారులు జీరోపై పంట ఉత్పత్తులను ఇతర రాష్ట్రాలకు తరలిస్తూ మార్కెటింగ్ శాఖ ఆదాయానికి గండి కొడుతున్నారు. వీరి అక్రమాలను నిరోధించేందుకు జేడీ రామాంజనేయులు మార్కెటింగ్ కమిటీ సెక్రటరీలకు దిశా నిర్దేశం చేయనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి.

13వ రోజు 280 మంది ఎంపిక

దేహదారుఢ్య పరీక్షలను పర్యవేక్షించిన ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా

కర్నూలు క్రైం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): పోలీసు కానిస్టేబుళ్ల నియామక దేహదారుఢ్య పరీక్షలు గురువారం 13వ రోజు కొనసాగింది. స్థానిక ఏపీఎస్పీ రెండో బెటాలియన్‌లో నిర్వహించే ఈ పరీక్షలకు నంద్యాల ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా పర్యవేక్షించారు. ఈ పరీక్షకు 600 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా.. 411 మంది బయో మెట్రిక్‌కు హాజరయ్యారు. వీరికి సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ తర్వాత ఎత్తు, ఛాతీ ఫిజికల్ మెజర్మెంట్ టెస్టులు నిర్వహించారు. అనంతరం వీరికి నిర్వహించిన ఫిజకల్ ఎఫిషియన్సీ టెస్టులు 1600 మీటర్ల పరుగు పరీక్షలో 298 మంది అర్హత సాధించారు. 100 మీటర్ల పరుగులో 174 మంది అర్హత సాధించారు. లాంగ్‌జంప్‌లో 275 మంది అర్హత సాధించారు. కానిస్టేబుల్ మెయిన్స్ పరీక్షకు 13వ రోజు 280 మంది అర్హత సాధించారు. ఇన్‌చార్జి ఎస్పీ హోంగార్డు కమాండెంట్ సదరన్ రీజియన్ మహేష్ కుమార్, అడిషనల్ ఎస్పీ అడ్మిన్ జి. హుశేన్ పీరా, ఏఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణ మోహన్, డీఎస్పీలు, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

రేపు కళావాహిని సాంస్కృతిక ప్రదర్శనలు

కర్నూలు కల్చరల్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): నగరంలోని కళావాహిని సాంస్కృతిక, సాహితీ సంస్థ ఆధ్వర్యంలో రిపబ్లిక్ దినోత్సవాన్ని పురస్కరించుకొని బాలబాలికల సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్లు ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం. మనోహర్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం సాయంత్రం 6.30 గంటలకు నగరంలోని కొండారెడ్డి బురుజు వద్ద నున్న మున్సిపల్ పార్కులో ఈ ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. ఈ ప్రదర్శనల్లో భాగం కావాలని అనుకున్నవారు తమ పేర్లను సెల్ నెం. 88863 74796, 77029 44714లకు ఫోన్ చేసి నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు.

ఎటూ తేలని నీరు-చెట్టు లెక్కలు

5వ పేజీ తరువాయి

నీరు-చెట్టు పథకం బిల్లులు ఎంత చెల్లించాలి..? ఆ బిల్లులు క్లియర్ చేయాలనే లక్ష్యంగా ప్రభుత్వం ఇప్పటికే రెండు విడతలుగా సమీక్ష నిర్వహించారు. నెలనెలా బిల్లులు పెరుగుతుండడంతో జలవనరుల శాఖ అధికారులు విస్తుపోతున్నారు. దీంతో ఈ నెల 31వ తేదిలోగా నీరు-చెట్టు పనుల లెక్కలు తేల్చండి. పెండింగ్ బిల్లులు అప్ లోడ్ చేసి బిల్లులు క్లోజ్ చేశామని సంబంధిత డ్రాయింగ్ అథారిటీ అధికారి డిక్లరేషన్ ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు. ఆ బాధ్యతను నీరు-చెట్టు నోడల్ అధికారులకు అప్పగించారు. 31వ తేది తరువాత వచ్చే బిల్లులు అప్‌లోడ్ చేయబోమని, వాటిని పరిగణలోకి తీసుకోమని కూడా తేల్చి చెప్పారు. దీంతో కర్నూలు, నంద్యాల జిల్లాల్లో 16 డివిజన్ల పరిధిలో నీరు-చెట్టు లెక్కలు తేల్చేందుకు అధికారులు రికార్డులతో కుస్తీ పడుతున్నారు. ఇప్పటికీ సుమారు రూ.300 కోట్లకు పైగా బిల్లులు చెల్లించాల్సి ఉంటుందని అంచనా వేస్తున్నారు. బిల్లులు అప్‌లోడ్ చేయడానికి ప్రభుత్వం ఈ నెలాఖరుకు గడువు పెట్టడంతో బిల్లులు రాక ఆర్థిక ఇబ్బందులు పడుతుకున్న కాంట్రాక్టర్లు, టీడీపీ కార్యకర్తలు ఇంజనీరింగ్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

విజిలెన్స్ విచారణ

కర్నూలు జిల్లాలో నీరు-చెట్టు బిల్లులు చెల్లింపులో భారీగా అక్రమాలు జరిగాయనే ఆరోపణలు ఉన్నాయి. గంపెడు మట్టి తీయకుండా చేయని పనులను చేసినట్లు రికార్డుల్లో నమోదు చేశారు. ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాలో డోన్, బేతంచర్ల, వెల్దుర్తి, కృష్ణగిరి, ఆస్పరి, గోనెగండ్ల, ఆదోని మండలాల్లో మైనర్ ఇరిగేషన్ విభాగంలో నీరు-చెట్టు కింద మంజూరైన పనులు గుర్తించి ఫోర్జరీ డాక్యుమెంట్లు సృష్టించి బిల్లులు అప్‌లోడ్ చేసి వందకుపైగా పనులకు సబంధించి సుమారుగా రూ.10 కోట్లకుపైగా అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. అత్యధికంగా డోన్, బేతంచర్ల మండలాలు అక్రమాలు జరిగితే.. ఆ తరువాత స్థానాల్లో గోనెగండ్ల, ఆస్పరి, ఆదోని మండలాలు ఉన్నాయి. ఈ భాగోతం వెనుక గతంలో ఇక్కడ పని చేసిన బదిలీపై వెళ్లిన వైసీపీ రంగు పూసుకున్న ఓ అధికారి పాత్రపై ఉందనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. గతంలోనే ఆంధ్రజ్యోతి వరుస కథనాలతో వెలుగులోకి తెచ్చింది. ఈ అక్రమాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దృష్టి సారించారు. విచారణలో భాగంగా జిల్లాలో జరిగిన నీరు-చెట్టు పనుల సమగ్ర వివరాలు ఇవ్వాలంటూ జలవనరుల శాఖ అధికారులకు విజిలెన్స్ ఎస్పీ లేఖ రాసినట్లు తెలుస్తున్నది. అయితే.. నెల రోజులు దాటినా అధికారులు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు సమగ్ర వివరాలతో నివేదిక ఇవ్వలేదని సమాచారం.

నివేదిక తయారు చేస్తున్నాం

నీరు-చెట్టు పనుల్లో ఎన్ని బిల్లులు పెండింగ్‌లో ఉన్నదీ గుర్తించి ఈ నెల 31లోగా అప్‌లోడ్ చేయమని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అందులో భాగంగానే సబ్ డివిజన్ల వారిగా నివేదికలు తయారు చేస్తున్నాం. ఈ నెలాఖరులోగా ప్రభుత్వానికి పంపుతాం.

- బి. బాలచంద్రారెడ్డి, ఎస్ఈ, జలవనరుల శాఖ, కర్నూలు


గోనేగండ్ల మండలం గంజేహల్లి గ్రామ సమీపంలోని మల్లెల వంక. ఈ వంకపై మూడు చెక్ డ్యాంలు నిర్మించినట్లు రూ.29.50 లక్షలకు ఫోర్జరీ సంతకాలతో ఓ కాంట్రాక్టరు రికార్డులు సృష్టించారు.

కష్టపడే వారికే పార్టీలో గుర్తింపు

20 సూత్రాల చైర్మన్ లంకా దినకర్




మాట్లాడుతున్న 20 సూత్రాల చైర్మన్ లంకా దినకర్

కర్నూలు ఎడ్యుకేషన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): కష్టపడి పని చేస్తే పార్టీ గుర్తిస్తుందని, ఎవరూ నిరుత్సాహపడవద్దని 20 సూత్రాల చైర్మన్ లంకా దినకర్ తెలిపారు. గురువారం స్థానిక నరసింహారెడ్డి నగర్‌లోని బీజేపీ కార్యాలయంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా లంకా దినకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. ప్రభు త్వంలోనేగాక పార్టీలో ఉండి కూడా ప్రజలకు సేవ చేయవచ్చునన్నారు. పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పని చేద్దామని ఆయన పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు అర్హులైన వారికి అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆదోని ఎమ్మెల్యే వాల్మీకి పార్థసారధి మాట్లాడుతూ బీజేపీ కార్యకర్తలు అంకిత భావంతో పార్టీ అభివృద్ధికి పని చేయాలన్నారు. ఎప్పటికప్పుడు వైసీపీ దుర్మార్గాలను పసిగట్టి అరికట్టాలన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బీఎస్ నాగరాజు, రామస్వామి, రాఘవేంద్ర, ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.

ముగిసిన నంది బాలోత్సవాలు

నంద్యాల రూరల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా కేంద్రంలోని టౌన్‌హాల్‌లో నిర్వహించిన నంది బాలోత్సవాలు విజయవంతంగా ముగిశాయి. రెండు రోజుల పాటు నిర్వహించిన ఈ బాలోత్సవాల్లో జిల్లా వ్యాప్తంగా వివిధ పాఠశాలలకు చెందిన ఐదువేల మంది విద్యార్థులు పలు రకాల ప్రదర్శనల్లో పాల్గొని ప్రతిభను చాటారు. రెండోరోజు గురువారం ఫ్యాన్సీడ్రెస్, క్లాసికల్‌డ్యాన్స్, జానపదనృత్యం, దేశభక్తి, కోలాటం, మట్టితో బొమ్మలతయారీ, క్విజ్, తెలుగు, ఇంగ్లీష్‌లో ఉపన్యాసం, పద్యభావం తదితర కార్యక్రమాలలో విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో గెలుపొందిన విద్యార్థులకు డీఈఓ జనార్ధన్‌రెడ్డి, డాక్టర్ క్రాంతిచైతన్యలు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో నంది బాలోత్సవ నిర్వాహకులు శంకరయ్య, మౌలాలి, బాస్కరరావు, నాగరాజు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రశంసా పత్రాలను అందజేస్తున్న డీఇవో జనార్ధన్‌రెడ్డి

నేడు విద్యాశాఖ రాష్ట్ర కమిషనర్ విజయరామరాజు రాక

కర్నూలు ఎడ్యుకేషన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాకు పాఠశాలల విద్యాశాఖ రాష్ట్ర కమిషనర్ విజయరామరాజు శుక్రవారం కర్నూలు రానున్నారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు జి. పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలోని మీటింగ్ హాల్‌లో రెండు జిల్లాలకు సంబంధించిన విద్యాశాఖ అధికారులు, ఉప విద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించనున్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం 117 జీవోను రద్దు చేసింది. కొత్తగా స్కూల్ కాంప్లెక్స్‌లను బలోపేతం చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు విద్యాశాఖ అధికారులతో సూచనలు, సలహాలను స్వీకరించనున్నారు. పాఠశాలలపే ఎలా బలోపేతం చేయాలో దానికి సంబంధించిన అంశాలను విద్యాశాఖ అధికారులకు ఆయన దిశా నిర్దేశం చేయనున్నారు.

ఉద్యోగాల కల్పనలో సర్కార్ వైఫల్యం

ఏఐవైఎఫ్ జాతీయ కార్యదర్శి తిరుమలై రామన్



మాట్లాడుతున్న జాతీయ కార్యదర్శి టి.రామన్

కర్నూలు న్యూసిటీ, జనవరి 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ ఉద్యోగ కల్పనలో వైఫల్యం చెందిందని ఏఐవైఎఫ్ జాతీయ కార్యదర్శి తిరుమలై రామన్ విమర్శించారు. గురువారం నగరంలోని చంద్ర రాజేశ్వర్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డీఎస్సీ నోటిఫికేషన్‌కి మొదటి సంతకం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇప్పటి వరకు దాని గురించి మాట్లాడకపోవడం సిగ్గుచేటన్నారు. అంతేకాకుండా అమరావతిని ఫ్రీజోన్‌గా చేసి 26 జిల్లాల నిరుద్యోగ యువతకు రాష్ట్ర రాజధానిలో ఉద్యోగాలు పొందేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ 17వ జాతీయ మహాసభలు ఏప్రిల్ మొదటి వారంలో కర్నూలు నగరంలో నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలకు వీసీలను నియమించే అధికారం రాష్ట్ర ప్రభుత్వం చేతిలో ఉండేదని, అయితే మోదీ ప్రభుత్వ ఆ హక్కును కాలరాస్తూ వీసీల నియామకాన్ని తమ చేతుల్లోకి తీసుకుందన్నారు. మోదీ ప్రభుత్వం యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని లేనిపక్షంలో దేశవ్యాప్తంగా నిరుద్యోగ భృతిని రూ.15 వేలు ఇవ్వాలన్నారు. మోదీ ప్రభుత్వం దేశవ్యాప్తంగా విద్యావ్యవస్థను భ్రష్టుపట్టించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి నక్కి లెనిన్‌బాబు, ఉపాధ్యక్షుడు కారుమంచి, నాగరాముడు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీరాములు, శ్రీనివాసులు, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సోమన్న, షాపీర్‌బాషా, ఉపాధ్యక్షుడు శరత్ తదితరులు పాల్గొన్నారు.

బాలికల సమస్యలపై అవగాహన పెంచాలి

ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ నిర్మలమ్మ

కర్నూలు రూరల్ జనవరి 23(ఆంధ్రజ్యోతి): కౌమార బాలికల సమస్యలపై అవగాహన పెంచాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ నిర్మలమ్మ అధికారులకు ఆదేశించారు. ఈమేరకు కర్నూలు మండల ప్రజా పరిషత సమావేశ భవనంలో గురువారం స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కిశోర వికాసం గురించి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మలమ్మ మాట్లాడుతూ కౌమార దశలో ఉన్న బాలికలకు ఎదురయ్యే సమస్యలు, ఆరోగ్యవంతమైన అలవాట్లపై అవగాహన కల్పించాలని అన్నారు. వాటితో పాటు పోషణ అవసరాలు, పిల్లల సంరక్షణ బాలికల నైపుణ్యాలు పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో వరలక్ష్మీదేవమ్మ, ఏసీడీపీవో నరసమ్మ, డీసీపీవో శారద, ఎంపీడీవో రఘునాథ్, ఎంఈవో హనుమంతరావు, వినోద్‌కుమార్, మెడికల్ అధికారి హేమలత, ఏపీఎం వసంత, ఐసీపీఎస్ నరసింహులు, సూపర్‌వైజర్లు పద్మావతి, విజయలక్ష్మి, జరీనాబాను పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే లక్ష్యం

- పథకాల అమలులో అధికారుల పాత్ర కీలకం
- 20 సూత్రాల కార్యక్రమాల అమలు చైర్మన్ లంకా దినకర్



మాట్లాడుతున్న లంకా దినకర్, పక్కనే కలెక్టర్ రంజిత్ బాషా



గౌరు చరిత (పాణ్యం) | శ్యాంబాబు (పత్తికొండ) | విరుపాక్షి (ఆలూరు) | పార్థసారథి (ఆదోని) | పాపిరెడ్డి (జడ్పీ చైర్మన్)

కర్నూలు కలెక్టరేట్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సంకల్పించిన వికసిత భారత్, రాష్ట్ర ముఖ్యమంత్రి అమలు చేస్తున్న స్వర్ణాంధ్ర-2047 లక్ష్యాల సాధన కోసం పని చేయాలని 20 సూత్రాల కార్యక్రమం చైర్మన్ లంకా దినకర్ అన్నారు. గురువారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో కేంద్ర ప్రాయోజిత పథకాలు, ప్రాజెక్టుల అమలుపై జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. చైర్మన్ మాట్లాడుతూ వికసిత భారత్‌లో స్వర్ణాంధ్రను భాగస్వామ్యం చేసేలా ప్రజల జీవన ప్రమాణాల పెంపు, పేదరిక నిర్మూలనే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు వెళ్తున్నాయన్నారు. వికసిత కర్నూలుగా తీర్చిదిద్దేందుకు అధికారులు దృష్టి పెట్టాలని సూచించారు. కర్నూలులో, ఆదోనిలో అమృత్-1 పనులు కొంతమేర పూర్తయ్యాయని, మిగిలిన పనులు మార్చిలోపు పూర్తి చేయాలని చైర్మన్ అధికారులను ఆదేశించారు. అదే అమృత్-2 టెండర్ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కలెక్టర్ రంజిత్ బాషా మాట్లాడుతూ ఆర్అండ్‌బీకి రూ.13 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. ఉపాధి హామీ నిధులతో ఇంటర్నల్ సీసీ రోడ్లు నిర్మిస్తున్నామని అన్నారు. జిల్లాలో టెక్స్‌టైల్ పార్కు కోసం స్థలం గుర్తించామన్నారు. జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తు అవసరాల కోసం అదనపు రిజర్వాయర్లు నిర్మించాలని అన్నారు. ఆదోని ఎమ్మెల్యే డా.పార్థసారథి మాట్లాడుతూ ఆదోనిలో పత్తి కార్పొరేషన్ ఆఫ్ ఇండియా మేనేజర్ ఫ్యాక్టరీలతో కుమ్మక్కై కమీషన్ తీసుకుంటూ రైతులను ఇబ్బందులు పెడుతున్నాడని, విచారణ చేయాలని కోరారు. పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు మాట్లాడుతూ పత్తికొండ పట్టణానికి టిడ్కో గృహ నిర్మాణాలు కేటాయించాలని, బొంతిరాళ్ల- బొందిమడుగుల రోడ్డు నిర్మాణాన్ని బాగు చేయాలని అన్నారు. ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి మాట్లాడుతూ ఆలూరు పట్టణంలో తాగునీటి సమస్యను, చింతకుంట నుంచి వేసిన బీటీ రోడ్డు, హొళగుంద-కొవ్వలతోట రోడ్లను రిపేరు చేయించాలన్నారు. కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూ కోడుమూరు పట్టణంలో ఎప్పుడో పాతకాలం నాటి ఎస్ఎస్ ట్యాంకు ఇప్పటికి వాడుకోవాల్సి వస్తుందని, ఆ నీరు సరిపోవడం లేదని అన్నారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి మాట్లాడుతూ నగరంలో 16 వార్డులో తాగునీటి సమస్యల ఉన్నందువల్ల గోరుకల్లు రిజర్వాయర్ నుంచి నీరు అందించాలన్నారు. ఈ సమావేశంలో జేసీ డా.బి. నవ్య, మంత్రాలయం ఇన్‌చార్జి రాఘవేంద్రారెడ్డి, రజక కార్పొరేషన్ చైర్మన్ సావిత్రి, రాష్ట్ర సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డైరెక్టర్ కొంకతి లక్ష్మీనారాయణ, కురుబ కురవ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప, డైరెక్టర్లు ఉదయ్ కుమార్, శ్రీనివాసులు, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ సంజమ్మ పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

కర్నూలు క్రైం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): నగరంలో రెండు వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు వృద్ధులు మృతి చెందారు. కర్నూలు మెడికల్ కళాశాల వద్ద గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో సత్యనారాయణ (74) అనే వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానిక బీ. క్యాంపు చెందిన సత్యనారాయణ బుధవారపేటలో ఉన్న ఓ కళాశాలలో తన మనుమళ్ల ఫీజు కట్టేందుకు వెళ్లి తిరిగి మోటారు సైకిల్‌పై వస్తుండగా.. నందికొట్కూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆయన కింద పడగా.. బస్సు టైరు సత్యనారాయణ తలపై వెళ్లింది. స్థానికులు ఆసుపత్రికి తీసుకెళ్లగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సత్యనారాయణ రిటైర్డు డ్వామా ఉద్యోగి. ఆయనకు ఇద్దరు కొడుకులు సంతానం ఉన్నారు. ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

- హైదరాబాదు జాతీయ రహదారి సంతోష్‌నగర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో సురేంద్రవర్మ (72) అనే వృద్ధుడు దుర్మరణం చెందాడు. స్థానిక సంతోష్‌నగర్‌కు చెందిన సురేంద్రవర్మ పేపరు మిల్లులో ఉద్యోగం చేసి పదవీ విరమణ పొందాడు. బుధవారం రాత్రి మెడికల్ దుకాణానికి వచ్చి రోడ్డు దాటుతుండగా.. బెంగుళూరు నుంచి హైదరాబాదు వైపు వెళ్తున్న బైకు ఢీ కొట్టింది. సురేంద్రవర్మ తీవ్రంగా గాయపడ్డాడు. ఆసుపత్రిలో కోలుకోలేక గురువారం రాత్రి మృతి చెందాడు. ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని బాలుడు..

పెద్దకడుబూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హనుమాపురం గ్రామ సమీపంలోని ఆదోని- ఎమ్మిగనూరు ప్రధాన రహదారిలో కారు- బైక్ ఢీకొని బాలుడు మృతి చెందాడు. కొత్త గొల్లల దొడ్డి గ్రామానికి చెందిన బోయ శంకర్ (14) తన తాత బందరామన్న గ్రామమైన హనుమాపురం వెళ్లాడు. అక్కడ నుంచి స్కూటర్‌పై పొలానికి బయలుదేరాడు. ఎమ్మిగనూరు నుంచి ఆదోనికి వెళ్తున్న కారు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. తండ్రి ఈరన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ నిరంజన్ రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

కర్నూలు క్రైం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): తాలుకా పోలీస్ స్టేషన్ పరిధిలో ఉల్చాల రోడ్డులో సుద్దబాయి సమీపంలో గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో సోమేశ్వరి(27) దుర్మరణం చెందింది. మోటారు సైకిల్‌పై వస్తున్న ఇద్దరు యువకులు ఆటోను వేగంగా వచ్చి ఢీకొనడం వల్లనే ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో మరో ఇద్దరు ఉర్దూ టీచర్లు, మరో ఇద్దరు ప్రయాణికులు గాయపడ్డారు. వివరాలివి.. ఉల్చాల గ్రామానికి చెందిన సోమేశ్వరి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో కాంట్రాక్టు నర్సుగా పని చేస్తున్నా. బుధవారం రాత్రి విధులకు వచ్చి గురువారం ఉదయం ఉల్చాలకు బయలుదేరారు. ఆమె ప్రయాణిస్తున్న ఆటోలో ఇదే గ్రామంలో ఉర్దూ పాఠశాలలో పని చేస్తున్న షేకూన్‌బీ అనే మరో ఉపాధ్యాయురాలితో పాటు మరో ఉపాధ్యాయురాలు, ఇద్దరు ప్రయాణికులు ఉన్నారు. ఆటో సుద్దబావి వద్దకు చేరుకోగానే ఉల్చాల వైపు నుంచి వస్తున్న ఇద్దరు యువకులు వేగంగా వచ్చి ఆటోను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ముందు కూర్చున్న సోమేశ్వరి కాళ్లకు బలంగా దెబ్బ తగిలింది. దీంతో పాటు ఆటో పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో సోమేశ్వరి కాళ్లు నుజ్జునుజ్జు కాగా ఆమె అపస్మారక స్థితికి చేరుకున్నారు. స్థానికులు అప్రమత్తమై ఆటోను పైకి లేపి అందులో గాయపడిన వారిని బయటకు తీసుకువచ్చారు. అనంతరం వీరందరినీ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సోమేశ్వరి ఆసుపత్రికి చేరుకోకముందే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. గాయపడిన వారికి ఆసుపత్రి వైద్యులు చికిత్స అందిస్తున్నారు. పోలీసులు సోమేశ్వరి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. సోమేశ్వరికి భర్త శివకుమార్, ఇద్దరు చిన్న పిల్లలు సంతానం. ప్రమాదానికి కారణమైన ఇద్దరు యువకుల్లో ఒకరికి చేయి విరిగింది. ప్రమోటారు సైకిలిస్టులపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీధర్ తెలిపారు.

వెంకటగిరిలో డీఎస్పీ విచారణ



గ్రామస్థులతో మాట్లాడుతున్న డీఎస్పీ బాబూప్రసాద్

కోడుమూరు రూరల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటగిరి ప్రాథమిక పాఠశాల(స్పెషల్)లో ఓ ఉపాధ్యాయుడు విద్యార్థినుల పట్ల లైంగిక వేధింపుల కేసులో పోక్సో చట్టం, ఎస్సీ, ఎస్టీ కేసు నమోదైన సంగతి తెలిసిందే. ఈ మేరకు గురువారం డీఎస్పీ బాబూ ప్రసాద్ వెంకటగిరి ఎస్సీ కాలనీలో ఉన్న పాఠశాల వద్ద విచారించారు. డీఎస్పీ ప్రజలు, బాలికలను వేర్వేరుగా విచారించారు. ఎంతో గౌరవప్రదమైన గురువు స్థానంలో ఉండి విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా వ్యవహరించిన ఉపాధ్యాయుడిపై కఠినంగా వ్యవహరించాలని ప్రజలు కోరారు. అలాగే ఎమ్మార్పీఎస్ నాయకులు నిందితుడిని కఠినంగా శిక్షించాలని కోరారు. డీఎస్పీ వెంట సీఐ తబ్రేజ్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

డీజిల్ చోరీ



నంద్యాల ఇసుక డంప్ యార్డు వద్ద నిలిపి ఉంచిన లారీలు

నంద్యాల క్రైం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): నంద్యాల రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగలు పలు లారీల్లో నుంచి డీజిల్ దొంగతనం చేశారు. మూడు లారీల్లోని డీజిల్‌తో పాటు మరో లారీకి సంబంధించిన బ్యాటరీ ఎత్తుకెళ్లారు. నంద్యాల మండలం అయ్యలూరి మెట్ట సమీపంలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో ఇసుక డంప్ యార్డును ఏర్పాటు చేశారు. ఈ ఇసుక డంప్‌యార్డుకు ఇతర ప్రాంతాల నుంచి లారీలు, టిప్పర్లలో ఇసుకను తరలిస్తుంటారు. ఇసుక అన్‌లోడ్ చేసిన తర్వాత కొన్ని లారీలు, టిప్పర్ల డ్రైవర్లు ఇక్కడే రాత్రి బస చేస్తుంటారు. అయితే గురువారం తెల్లవారుజామున కొందరు గుర్తుతెలియని వ్యక్తులు ప్రభుత్వ ఇసుక డంప్‌యార్డులోకి ప్రవేశించి మూడు లారీల్లోని వందలాది లీటర్ల డీజిల్‌ను ఎత్తుకెళ్లారు. ఆయా లారీల డ్రైవర్లు ఉదయమే తమ లారీల వద్దకు వెళ్లి చూసుకోగా డీజిల్ ట్యాంక్‌ల మూతలు తీసి ఉండటం గమనించారు. మరో లారీలోని బ్యాటరీని ఎత్తుకెళ్లారు. బాధిత లారీల డ్రైవర్లు నంద్యాల రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు తెలిసింది. డీజిల్ దొంగలు స్థానికులు, స్థానికేతరులా అన్న విషయమై నంద్యాల రూరల్ పోలీసులు స్థానికంగా ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలిస్తున్నట్లు తెలిసింది.

కంది కొనుగోళ్లు ప్రారంభం

ఆదోని అగ్రికల్చర్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కంది రైతుల నుంచి తొమ్మిది వేల టన్నుల కంది దిగుబడిని కేంద్రం ప్రకటించిన మద్దతు ధరతో కొనుగోలు చేస్తున్నట్లు మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ రాజు వెల్లడించారు. గురువారం ఆదోని మార్కెట్ యార్డులోని డీసీఎం గోదాం వద్ద మద్దతు ధరతో కంది కొనుగోలు కేంద్రాన్ని ఏడీఏ బాలవర్ధిని రాజుతో కలిసి ప్రారంభించారు. కంది రైతులు కేంద్రం ప్రభుత్వ కనీస మద్దతు ధర క్వింటాకు రూ.7,550కి విక్రయించుకోవాలని సూచించారు. జిల్లాలో 25 కొనుగోలు కేంద్రాలకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. 456 రైతు భరోసా కేంద్రాలను మ్యాపింగ్ చేశామని తెలిపారు. ఒక్కో రైతు నుంచి 100 క్వింటాళ్ల కందిని కొనుగోలు చేస్తామన్నారు. రైతులు ఆర్బీకేలలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. తప్పకుండా ఈ క్రాప్ నమోదై ఉండాలన్నారు. కొనుగోలు చేసిన 15 రోజుల్లో రైతుల ఖాతాల్లో నేరుగా జమ చేస్తామన్నారు. ఆదోని, ఆలూరు, ఆస్పరిలలో మొదటి విడతగా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని తెలిపారు. ఏవో అశోక్ కుమార్ రెడ్డి, కేడీసీఎంఎస్ మేనేజర్ ప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు.

లోకేశ్ పాదయాత్రతో భరోసా

- ఓర్వకల్లుకు భారీ పరిశ్రమలు, ప్రాజెక్టులు
- టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి

కర్నూలు అర్బన్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నారా లోకేశ్ చేసిన పాదయాత్ర రాష్ట్ర ప్రజల్లో భరోసా ను కలిగించిందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి పేర్కొన్నారు. ఆయన పాదయాత్ర ద్వారా ఉమ్మడి కర్నూలు జిల్లాలో 12 మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎంపీలు గెలిచి ఎన్డీయే కూటమి సత్తా చాటిందన్నారు. గురువారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యే కేఈ శ్యామ్‌బాబుతో కలిసి లోకేశ్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ముందుగా కేక్ కట్‌చేసి విశ్వేశ్వరయ్య సర్కిల్‌లో పంచి పెట్టారు. అనంతరం తిక్కారెడ్డి మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే లోకేశ్ రాష్ట్ర ప్రగతిపై దృష్టి సారించారన్నారు. దేశంలో ఏ రాజకీయ పార్టీకి లేని విధంగా తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలను తయారు చేశారన్నారు. అధినేత చంద్రబాబు ఆదేశాలతో కోటికి పైగా సభ్యత్వాలను నమోదు చేసి, రికార్డు సృష్టించారన్నారు. జిల్లాలో గుండ్రేవుల, ఆర్డీఎస్, వేదవతి ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నారని తెలిపారు. ఓర్వకల్లుకు భారీ పరిశ్రములు తెచ్చి యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారని తెలిపారు.



ఎమ్మెల్యే శామ్‌బాబుకు కేక్ తినిపిస్తున్న కుడా చైర్మన్ సోమిశెట్టి



రమణమ్మ కుటుంబ సభ్యులకు చెక్కును అందజేస్తున్న నాయకులు

కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మంత్రి లోకేశ్ నాయకత్వంలో యువతకు ఉపాధితో పాటు పరిశ్రమలకు ప్రాధాన్యమిస్తున్నారన్నారు. జిల్లాకు చెందిన మంత్రి టీజీ భరత్‌తో కలిసి దావోస్ పర్యటనలో అత్యధిక పెట్టుబడులతో రాష్ట్రానికి వన్నె తెస్తున్నారని తెలిపారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న వెల్దుర్తి మండలానికి చెందిన బోయ రమణకు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.4.58 లక్షల చెక్కును ఎమ్మెల్యే కేఈ శ్యామ్‌బాబు సమక్షంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో మంత్రాలయం ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర, తెలుగుయువత జిల్లా అధ్యక్షుడు అబ్బాస్, నగరాధ్యక్షుడు నాగరాజు, కార్పొరేటర్లు పద్మలతారెడ్డి, స్వామిరెడ్డి, సత్రం రామకృష్ణుడు, పేరపోగు రాజు, భాస్కర్‌రెడ్డి, చంద్రకాంత్, బేతంక్రిష్ణుడు తదితరులు పాల్గొన్నారు.

త్వరలో స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్ ప్రారంభం



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు

కర్నూలు హాస్పిటల్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌ను త్వరలో ప్రారంభించడానికి చర్యలు చేపట్టినట్లు జీజీహెచ్ సూపరింటెండెంట్ డా. వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం సర్వజన వైద్యశాల ధన్వంతరి హాలులో హెచ్‌వోడీలతో ఎన్టీఆర్ వైద్యసేవ, ఈ-హాస్పిటల్‌పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆసుపత్రిలో ఎన్టీఆర్ వైద్య సేవలకు ప్రభుత్వం కొత్త టార్గెట్ ఇచ్చిందన్నారు. 20శాతం లోకల్ పర్చేజ్ కింద మందుల కొనుగోలుకు డీఎంఈ అనుమతి ఇచ్చారని, అన్ని విభాగాల హెచ్‌వోడీలు కావాల్సిన డ్రగ్స్, వివరాలు ఇవ్వాలని ఆదేశించారు. స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ సేవలు ప్రారంభించడానికి చర్యలను హెచ్‌వోడీలతో సమీక్షించారు. ఓపీల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సీనియర్ ఫ్యాకల్టీ వైద్యులు ఓపీ విభాగంలో అందుబాటులో ఉండేలా చూసుకోవాలని హెచ్‌వో డీలను ఆదేశించారు. డిప్యూటీ సూపరింటెండెంట్ డా.కే.సీతారామయ్య, సివిల్ సర్జన్ అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం, ఏడీ రమేష్‌బాబు పాల్గొన్నారు.

‘ఆమెకు పని చేద్దామన్న ఆలోచన లేదు’



మాట్లాడుతున్న మంత్రి ఎన్ఎండీ ఫరూక్

- దళిత తహసీల్దార్‌పై మంత్రి ఫరూక్ అసహనం
- వైరల్‌గా మారిన మంత్రి వీడియో

నంద్యాల, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ ఓ దళిత సామాజికవర్గానికి చెందిన తహసీల్దార్‌పై చేసిన వ్యాఖ్యలు నంద్యాల జిల్లాలో వైరల్‌గా మారాయి. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలో రెండు రోజుల క్రితం సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణాల భూమి పూజకు మంత్రి హాజరయ్యారు. స్థానికులు కొందరు నంద్యాల అర్బన్ తహసీల్దార్ ప్రియదర్శినిపై మంత్రికి ఫిర్యాదు చేశారు. దీంతో మంత్రి ఫరూక్ తహసీల్దార్‌పై అసహనం వ్యక్తం చేశారు. ‘ప్రజలకు పనిచేద్దామనే ఉద్దేశం ఆమెకు లేదు. ఆమెంతకు ఆమె తప్పించుకుని పోవాలి కదా? పోనీ బాధ్యతగా పనిచేయాలి కదా..? లేకుంటే యాక్షన్ తీసుకోవాలి. ఇప్పటికే జిల్లా కలెక్టర్‌కు చెప్పాను. పని చేయకపోతే ప్రజలకు ఎందుకు..? ప్రభుత్వం జీతం ఇస్తోంది కదా? బాధ్యతగా పనిచేయాలి. ఊరకనే ఆఫీసులో కూర్చొని, ఎవరు వచ్చినా పలకుండా, పనులు చేయకుండా ఉంటే ఏలా..’ అంటూ మంత్రి కామెంట్స్ చేశారు. అయితే మంత్రి మాట్లాడిన ఈ వీడియో క్లిప్పింగ్‌ను కొందరు సోషల్ మీడియాలో షేర్ చేయడంతో వైరల్‌గా మారింది. విధి నిర్వహణలో నిక్కచ్చిగా వ్యవహరిస్తూ బాధ్యతగా పనిచేస్తున్న దళిత సామాజిక వర్గానికి చెందిన తహసీల్దార్‌పై మంత్రి ఇలా మాట్లాడటం అవమానించడమేనని దళిత సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. ఏదిఏమైనా రెండు రోజుల తరువాత ఈ వ్యాఖ్యలు వైరల్ కావడం.. అటు దళిత వర్గాలతో పాటు రెవెన్యూ ఉద్యోగుల్లోను చర్చకు దారి తీసినట్లయింది.

‘ఛత్తీస్‌ఘడ్‌లోంచి సైన్యాన్ని ఉప సంహరించాలి’



ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజాస్వామ్య సంఘాల ఐక్య వేదిక నాయకులు

కర్నూలు కల్చరల్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌ఘడ్‌లోంచి సైన్యాన్ని ఉపసంహరించాలని ప్రజాస్వామ్య సంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. ఛత్తీస్‌ఘడ్- ఒడిషా సరిహద్దులోని గరియాబండ్ ప్రాంతంలో ఇటీవల జరిగిన ఎన్‌కౌంటర్‌ను నిరసిస్తూ వేదిక కన్వీనర్ రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తుల చేతుల్లో కీలుబొమ్మగా మారి, దేశ సంపదలను కార్పొరేట్‌కు ధారాదత్తం చేయడానికి అటవీ ప్రాంతం నుంచీ ఆదివాసులను ఏరివేస్తున్నదని ఆరోపించారు. విరసం నాయకుడు పాణి మాట్లాడుతూ భారత సైన్యం సొంత ప్రజలైన ఆదివాసులు, మావోయిస్టులపైనే బాంబులు, ఆయుధాలతో కగార్ పేరుతో యుద్ధం చేస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం సైనిక బలగాలను మధ్య భారతదేశం నుంచి ఉపసంహరించుకోవాలని కోరారు. పౌరహక్కుల సంఘం నాయకుడు అల్లాబ కాష్, రైతు కూలీ సంఘం నాయకుడు సుంకన్న, ప్రజా అభ్యుదయ సంస్థ నాయకుడు శ్రీనివాసరావు, రాయలసీమ విద్యావంతుల వేదిక కో కన్వీనర్ విజయభాస్కర రెడ్డి, జనవిజ్ఞాన వేదిక బాధ్యుడు శేఖర్, డీటీఎఫ్ నా యకుడు రత్నం ఏసేపు, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

బాకులు చూపి కారుతో ఉడాయింపు?

నంద్యాల క్రైం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణ శివారులోని ఆటోనగర్‌లో కారు విక్రయించడానికి వచ్చిన వ్యక్తులకు కొందరు పిడిబాకులు చూపి బెదిరించి కారుతో పరారైన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. తెలంగాణ రాష్ట్రంలోని నారాయణపేటకు చెందిన వెంకటేష్ రెడ్డి అనే వ్యక్తి తన కారును విక్రయించేందుకు దళారి రాఘవేంద్ర, హనుమంతు ఇద్దరిని నంద్యాలకు పంపారు. నంద్యాల ఆటోనగర్‌లో హనుమంతుతో బేరం చేస్తున్నట్లు నటించిన కొందరు కారుతో ఉడాయించారు. జరిగిన ఘటనను బాధితులు కారు యజమాని వెంకటేష్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. గురువారం వెంకటేష్ రెడ్డి నంద్యాలకు వచ్చి జరిగిన ఘటనపై తాలుకా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఈ ఘటనపై నంద్యాల తాలుకా అర్బన్ సీఐ ఈశ్వరయ్యను ఫోన్‌లో సంప్రదించగా ఆయన అందుబాటులోకి రాలేదు. డీఎస్పీ ఆల్ఫాన్స్‌ను అడగగా తన దృష్టికి రాలేదని, విచారణ చేస్తామని చెప్పారు.

మెడికల్ కాలేజీలో స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్


స్వచ్ఛ దివస్‌లో పాల్గొన్న మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్

కర్నూలు హస్పిటల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి స్వచ్ఛత వైపు ఒక అడుగు ముందుకు వేయాలని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కే. చిట్టినరసమ్మ అన్నారు. గురువారం కాలేజీ ఆవరణలోని మైదానంలో కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లుతో కలిసి స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్ర మాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు ఎన్ ఎస్ఎస్, ఎన్‌సీసీ సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధి వివరాలను పోర్టల్‌లో నమోదు చేయాలి

కర్నూలు కలెక్టరేట్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): యాస్పిరేషనల్ బ్లాక్స్ (హోళగుంద, మద్దికెర, చిప్పగిరి) మండలాల్లో నిర్ధేశించిన సూచికలకు సంబంధించిన అభివృద్ధి వివరాలను సంబంధిత పోర్టల్‌లో నమోదు చేయాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో యాస్పిరేషనల్ బ్లాక్స్ అభివృద్ధి పనుల పురోగతి, పోర్టల్‌లో అప్ డేషన్‌పై కలెక్టర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లా డుతూ యాస్పిరేషనల్ బ్లాక్స్‌లో చేపట్టిన 41 సూచికలకు సంబంధిం చిన అభివృద్ధి పనుల వివరాలను త్వరితగతిన పోర్టల్‌లో అప్‌డేట్ చేయాలన్నారు. ఐసీడీఎస్‌కు సంబంధించి పోషకాహారం లోపం ఉన్న 5ఏళ్లలోపు పిల్లలకు ఏఎన్ఎం, అంగన్‌వాడీ టీచర్లు లేదా ఆయాలు పిల్లల ఇంటికి వెళ్లి ఎలాంటి న్యూట్రిషన్ ఆహారం ఇచ్చారు. బాలామృతం ఇచ్చారు తదదితర వివరాలు యాప్‌లో అప్‌లోడు చేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పెండింగ్‌లో ఉన్న టాయిలెట్లను, ట్యాప్ కనెక్షన్లను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సమావేశంలో సీపీఓ భారతి, హౌసింగ్ పీడీ చిరంజీవి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి వరలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు, యాస్పిరేషనల్ బ్లాక్స్ మండలాల అధికారులు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరాలను వినియోగించుకోవాలి

కల్లూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): పశువైద్య శిబిరాలను రైతులు వినియోగించుకోవాలని జిల్లా గొర్రెలు, మేకల పెంపకందారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు సూచించారు. గురువారం కల్లూరు మండలం పందిపాడులో ఆ శాఖ జిల్లా సంయుక్త సంచాలకుడు డాక్టర్ శ్రీనివాసరావు, సహాయ సంచాలకుడు పార్థసారధి ఆధ్వర్యంలో చేపట్టిన పశువైద్య శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా గొర్రెలు, మేకలు, పాడిగేదెలు, ఆవుదూడలకు నట్టల నివారణ మందులు తాపించారు. ఆదేవిధంగా పెద్ద పశువులకు చికిత్స, కృత్రిమ గర్భధారణ, చూలు పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో పందిపాడు సహకార సంఘం అధ్యక్షుడు సి.బీసన్న, డైరెక్టర్ భీస్ముడు, టీడీపీ నాయకులు అయ్యపురెడ్డి, శేఖర్ చౌదరి, పర్ల పశువైద్యాధికారి డి.అమృత పాల్గొన్నారు.

బడ్జెట్ ప్రతిపాదనలు ఇవ్వండి

గూడూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): 2025-26 విద్యాసంవత్సరానికి కావాల్సిన బడ్జెట్ ప్రతిపాదనలు ఇవ్వాలని మండల విద్యాశాఖ అధికారి సునీలమ్మ తెలిపారు. గురువారం మండలంలోని అన్ని ప్రాథమిక ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పాఠశాలల డెవలప్‌మెంట్ ప్లాన్‌పై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్ఎంలు పాల్గొన్నారు.

'గతంలో దావోస్ పేరుతో జగన్ విహార యాత్ర'


మాట్లాడుతున్న నంద్యాల నాగేంద్ర

కర్నూలు అర్బన్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ సీఎం జగన్మోహన్‌రెడ్డి దావోస్ పేరుతో విహార యాత్ర చేయగా..ప్రస్తుత సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చారని ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్, రాష్ట్ర కార్యదర్శి నంద్యాల నాగేంద్ర అన్నారు. గురువారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమా వేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మునెప్ప
- నగరంలో ఆటో కార్మికుల ర్యాలీ

కర్నూలు న్యూసిటీ, జనవరి 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మునెప్ప డిమాండ్ చేశారు. ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ 9వ నగర మహాసభ సందర్భంగా గురువారం కలెక్టరేట్ నుంచి అంబేడ్కర్ భవన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మునెప్ప మాట్లాడుతూ ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైఫల్యం చెందాయన్నారు. పెరిగిన నిత్యావసర సరుకులు, డీజిల్, పెట్రోల్ ధరలను భరించలేని పరిస్థితిలో కార్మికులు ఉన్నారన్నారు. ఇలాంటి వారి కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన నూతన చట్టంతో ట్రాఫిక్ పోలీసుల దాడులు, ఆటో ఫైనాన్స్ కంపెనీల ఆగడాలతో కార్మికులు జీవితాలు నష్టపోతున్నాయన్నారు. ఈ సభకు ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్, ఎస్ఐ వెంకటేష్‌లు హాజరై కార్మికులకు సూచనలిచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ కార్యదర్శి ఎస్.కృష్ణయ్య, ఆటో యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.మధు, ఏ.ఈశ్వర్, గణేష్, ఏఐటీయూసీ నగర అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేష్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ఆటో కార్మికులు, ఏఐటీయూసీ నాయకులు

మరమ్మతులకు గురైన చెత్త వాహనం

మరో వాహనంతో షెడ్డుకు తరలింపు


చెడిపోయిన వాహనాన్ని ట్రాక్టర్‌తో తరలిస్తున్న దృశ్యం

కర్నూలు న్యూసిటీ, జనవరి 23(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థకు సంబంధించి చెత్తను తరలించే టిప్పర్ మరమ్మతుకు గురైంది. దీంతో మరో వాహనంతో దానిని మెకానిక్ షెడ్డుకు తరలించారు. నగరంలో చెత్తను సేకరించాల్సి వాహనాలు పరిస్థితి ఇలా ఉంది. అయితే ఇటీవల క్లాప్ ఆటోలను తొలగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలో ఉన్న వాహనాలతోనే చెత్తను తరలించాల్సిన పరిస్థితి నెలకొంది. అయితే వాహనాలు ఇలా మరమ్మతులకు గురైతే కాలనీల్లో ఉండే చెత్తను ఎలా సేకరిస్తారనేది ప్రశ్నార్థకంగా మారింది.

ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

కర్నూలు న్యూసిటీ, జనవరి 23(ఆంధ్రజ్యోతి): డ్రైవింగ్, వాహనాల ఫిట్నెస్ టెస్టులను ప్రైవేట్ సంస్థలకు అప్పగిస్తున్న ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంజిబాబు డిమాండ్ చేశారు. గురువారం కార్మిక కర్షక భవన్‌లో ఆల్ ఇండియా ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ సమావేశం ఉపాధ్యక్షుడు రాధాక్రిష్ణ అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా అంజిబాబు మాట్లాడుతూ ప్రైవేట్ సంస్థలు ఏర్పాటు చేస్తున్న సెన్సార్ ఫిట్నెస్ ట్రాకులను వెంటనే నిలిపివేయాలన్నారు. వారాల తరబడి ఈకేవైసీ, మండల మ్యాపింగ్ లాంటి సేవలు వేగవంతం చేయాలన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు పీఎస్.రాధాక్రిష్ణ, ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి కె.ప్రభా కర్, నాయకులు మహమూద్, రవి, హుస్సేన్ పాల్గొన్నారు.

నేడు కార్మికులకు గుర్తింపు కార్డుల పంపిణీ

కర్నూల లీగల్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): నగరంలోని వివిధ రంగాల్లో పనిచేస్తున్న అసంఘటిత కార్మికులకు శుక్రవారం గుర్తింపు కార్డులను, ఈశ్రమ్ కార్డులను పంపిణీ చేస్తామని కర్నూలు జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.కబర్ధి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్య దర్శి బి.లీలా వెంకటశేషాద్రిలు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బీ.క్యాంపులోని సిల్వర్ జూబ్లీ కళాశాలలో ప్రత్యేక క్యాంపును ఈ మేరకు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ క్యాంపులో భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వ గుర్తింపు కార్డులను, ఇతర రంగాల అసంఘటిత కార్మికులకు ఈశ్రమ్ కార్డులను కార్మిక శాఖ ద్వారా పంపిణీ చేయను న్నట్లు వారు తెలిపారు. కార్మికులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు.

26న మాంసం విక్రయాలు నిషేధం

కర్నూలు న్యూసిటీ, జనవరి 23(ఆంధ్రజ్యోతి): నగరంలో ఈ నెల 26న గణతంత్ర దినోత్సవం పురస్కరించుకుని మాంసం విక్రయాలు చేయరాదని నగర పాలక సంస్థ ప్రజారోగ్య అధికారి కె.విశ్వేశ్వరరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కబేళాలు, మాంసం అమ్మే దుకాణాలు ఆదివారం రోజు మూసివేయాలని, హోటళ్లు, రెస్టారెంట్లలో సైతం మాంసం పదార్థాలు విక్రయించకూడదని పేర్కొన్నారు. ఇందుకు విరుద్ధంగా ఎవరైనా వ్యవహరిస్తే వారి వ్యాపార ట్రేడ్ లైసెన్సు రద్దు చేయడంతోపాటు భారీ జరిమానా విధిస్తామన్నారు.

ఉపాధ్యాయుడిని కఠినంగా శిక్షించాలి

కర్నూలు న్యూసిటీ, జనవరి 23(ఆంధ్రజ్యోతి): కోడుమూరు మండలం వెంకటగిరిలో బాలికలను వేధించిన ఉపాధ్యాయుడిని కఠినంగా శిక్షించాలని ఏపీ మహిళా సమాఖ్య నగర కార్యదర్శి వి.భారతి డిమాం డ్ చేశారు. గురువారం సీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించి బంగారుబాటలు వేయాల్సిన ఉపాధ్యాయుడు కీచకంగా వ్యవహరించడం సరికాదన్నారు. సమావేశంలో పావని, శైలజ పాల్గొన్నా రు.

పోస్టర్ విడుదల

కర్నూలు ఎడ్యుకేషన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ టౌన్ మోడల్ ఉన్నత పాఠశాలలో బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని పోస్టర్‌ను మహిళా పోలీస్ స్టేషన్ సీఐ ఆదిలక్ష్మి గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలను బాలురతో సమానంగా పెంచాలన్నారు. బాలికలకు ఏ రంగంలో ఆసక్తి ఉందో దాంట్లో వారిని ఎదిగేందుకు తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. ఈసమావేశంలో ఏపీ డిస్ట్రిక్ట్ చైల్డ్ రైట్స్ ఫోరం ప్రెసి డెంట్ కే.విజయరాజు, రీజనల్ కన్వీనర్ బత్తుల చెన్నయ్య, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళా సంఘం నగర అధ్యక్షురాలు మీసాల సుమలత మహిళా కానిస్టేబుల్ రమబాయి, సభ్యులు, పాఠశాల హెచ్ఎం పాల్గొన్నారు.

ఘనంగా సుభాష్ చంద్రబోస్ జయంతి

కర్నూలు కల్చరల్, జనవరి 23(ఆంధ్రజ్యోతి) నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా పాతనగరంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఆయన చిత్రపటానికి గ్రంథా లయ సంస్థ ఉద్యోగులు, పాఠకులు పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. కార్యక్రమంలో జిల్లా కేంద్ర గ్రంథాలయ ఉప గ్రంథాలయ అధికారి వి.పెద్దక్క, గ్రంథాలయ ఉద్యోగులు వజ్రాల గోవిందరెడ్డి, మగ్బుల్ బాషా, రాజు, సుదర్శన్, కార్యాలయ సిబ్బంది, గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.

కర్నూలు రాజ్‌విహార్ సర్కిల్: స్వాతంత్ర్యోద్యమ సమయంలో ఎందరో యువతకు స్ఫూర్తిగా నిలిచిన మహనీయుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని జనసేన రాయలసీమ జోన్ ఎన్నికల ప్రతినిధి పవన్ కుమార్ అన్నారు. గురువారం ఆయన కార్యాలయంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలు వేసి నివాళి అర్పించారు. జనసేన నాయకులు కరుణాకర్, చంద్రమౌళి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

కర్నూలు ఎడ్యుకేషన్: స్థానిక బీ.క్యాంపు ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో గురువారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్, అధ్యాపకులు నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కర్నూలు అర్బన్: స్వాతంత్ర్యోద్యమంలో సేవలందించిన గొప్ప నాయకుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని ప్రిన్సిపల్ ఇందిరా శాంతి అన్నారు. గురువారం నగరంలోని ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాలలో సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో చరిత్రశాఖ అధ్య క్షుడు ఎ.వెంకటస్వామి, వైస్ ప్రిన్సిపాల్ హేమంత్, డా వీ వింధ్యా వాసినీ దేవి, శశికళ పాల్గొన్నారు.

కోడుమూరు: స్థానిక యూత్ రిక్రియేషన్‌లో సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కోడుమూరు పట్టణ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఈ వేడు కలు చేపట్టారు. ఈ సందర్భంగా సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం భారత స్వాతంత్ర పోరాటంలో ఆయన చేసిన పోరాట పటిమలను గుర్తు చేసుకొన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు షాకీర్, కృష్ణయ్య, హుశేనప్ప, బలరాం, జయరాం, రాజు, కుమారస్వామి, హనుమంతప్ప, కేశవ, వీరన్న స్నేహ వృద్ధాశ్రమం నిర్వాహకురాలు సుభాషిని పాల్గొన్నారు.


సుభాష్ చంద్రబోస్‌కు నివాళులర్పిస్తున్న గ్రంథాలయ సంస్థ ఉద్యోగులు


నివాళులర్పిస్తున్న జన సైనికులు

సచివాలయ సిబ్బందిపై ఎంపీడీవో ఆగ్రహం

సి.బెళగల్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): సి.బెళగల్‌లోని ఒకటో, రెండో సచివాలయాలో పనిచేస్తున్న సిబ్బంది ఒంటి గంటైనా కూడా కార్యాల యాన్ని తెరవకపోవడంతో ఎంపీడీవో రాణెమ్మ వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఎంపీడీవో రాణెమ్మ మాట్లాడుతూ సచివాలయం దగ్గర వృద్దులు, వికలాంగులు, రైతులు, విద్యార్థులు పలు రకాల సర్టిఫికెట్ల కోసం వచ్చి పడిగాపులు కాస్తున్నారు. వారితో ఎంపీడీవో మాట్లాడి సచివాలయ సిబ్బందికి ఫోన్ చేసి ఎక్కడ ఉన్నారని అడిగితే బస్సులు లేటు అయిందని కొందరు, ఫీల్డ్‌లో ఉన్నామని కొందరు చెప్పారు. విధులకు గైర్హాజరైన సచివాలయ సిబ్బందిపై జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని ఎంపీడీవో రాణెమ్మ తెలిపారు.

ఫుట్‌బాల్ లీగ్ పోటీల్లో జిల్లా క్రీడాకారిణి

కర్నూలు స్పోర్ట్స్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): బెంగళూరులో ఈ నెల 25వ తేదీన నిర్వహించే డివిజన్ ఫుట్‌బాల్ లీగ్ పోటీలకు ఎం.రేణుక క్రీడాకారిణి ఎంపికైంది. ప్రభుత్వ కళాశాల (ఫర్ మెన్)లో డిగ్రీ రెండో సంవత్సరం బీఏ చదువుతుంది. లక్ష్య ఫుట్‌బాల్ శిక్షణలో ప్రతిభ కనబరిచింది. బెంగళూరు ఏ డివిజన్ ఫుట్‌బాల్ లీగ్ పోటీలకు ఎంపిక పట్ల జిల్లా ఫుట్‌బాల్ సంఘం అధ్యక్షుడు ముప్పా రాజశేఖర్ సహాయధ్యక్షుడు విజయకుమార్, కార్యదర్శి శ్రీనివాసులు క్రీడాకారిణి రేణుకకు అభినందనలు తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిరాశాంతి, ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి, కోచ్ బ్రహ్మకుమార్‌లు అభినందనలు తెలిపారు.

ప్రజా ఆరోగ్యానికి పెద్దపీట

కల్లూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు ప్రజా ఆరోగ్యానికి పెద్దపీట వేస్తున్నారని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. గురువారం మాధవీనగర్‌లోని తన స్వగృహంలో అర్హులైన పేదలకు రూ. 8,89,392ల సీఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. పాణ్యం నియోజకవర్గానికి చెందిన మాదిగ తిరుపాలు, ప్రభావతమ్మ, బోయ కళావతమ్మ, రోళ్లపాడు రంగమ్మ, షేక్షావలి, విమలకు చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో పెరుగు పురుషోత్తంరెడ్డి, ప్రభాకర్‌యాదవ్, బి.నాగిరెడ్డి పాల్గొన్నారు.

ఎన్. కొంతలపాడులో హుండీ లెక్కింపు

ఓర్వకల్లు జనవరి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎన్.కొంతలపాడులో వెలసిన యాగంటీశ్వరస్వామి ఆలయ హుండీ లెక్కింపు గురువారం ఈవో చంద్రశేఖర్ రెడ్డి, ఇన్స్‌పెక్టర్ రమేష్, భక్తుల ఆధ్వర్యంలో జరిగింది. రూ.1,30,068లు ఆదాయం వచ్చినట్లు ఈవో తెలిపారు. హుండీ లెక్కింపులో భక్తులు శ్రీనివాసులు, మధు, చంద్రప్ప, రోశన్న, పుల్లన్న, అర్చకులు యాగంటయ్య, ఉరుకుం దయ్య, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

రీ సర్వేతో భూ సమస్యలు పరిష్కారం

గూడూరు, జనవరి 23:(ఆంధ్రజ్యోతి): రీ సర్వేతో భూ సమస్యలు పరిష్కారమవుతాయని రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ లోకేశ్వరరెడ్డి అన్నారు. గురువారం గూడూరు మండలం చనుగొండ్లలో రీ సర్వే కార్యక్రమాన్ని లోకేశ్వరరెడ్డి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని చనుగొండ్లలో మూడు బృందాలు రీ సర్వే నిర్వహిస్తున్నాయన్నారు.

ఉన్నత విద్యకు మంత్రి లోకేశ్ ప్రాధాన్యం

జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యేలు, ఆర్‌యూ వీసీ

కర్నూలు అర్బన్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యకు మంత్రి నారా లోకేశ్ ప్రాధాన్యం ఇచ్చారని పాణ్యం, నందికొట్కూరు, కోడు మూరు ఎమ్మెల్యేలు గౌరు చరిత, గిత్తా జయసూర్య, బొగ్గుల దస్తగిరి అన్నారు. గురువారం ఆర్‌యూలో రాయలసీమ విద్యార్థి, యువజన సంఘాల జేఏసీ చైర్మన్ శ్రీరాములు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యేలతోపాటు ఇన్‌చార్జి ఉపకులపతి, ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ హాజరై పేద విద్యార్థులకు రూ.10లక్షల విలువ చేసే పుస్తకాలు ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం మొక్కలను నాటి కేక్ కట్‌చేసి లోకేశ్‌కు జన్మదిన శుభాకంక్షలు తెలిపారు. నవ్యాంధ్ర విద్యా ర్థి జేఏసీ అధ్యక్షుడు అయ్యస్వామి, ఆర్‌యూ ఎన్‌సీసీ కోఆర్డినేటర్ నాగారాజు, నాన్ టీచింగ్ అసోసియేషన్ నాయకుడు నారాయణ, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ హరిప్రసాదరెడ్డి, పాల్గొన్నారు.

టీఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో.. టీఎన్‌టీయూసీ కార్యాలయంలో నారా లోకేశ్ జన్మదినం సందర్భంగా నాయకులు కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకు న్నారు. కార్యక్రమంలో టీఎన్‌టీయుసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అశోక్ కుమార్, జిల్లా అధ్యక్షుడు వై.నరసింహులు, జిల్లా నాయకులు వై.రాజు, బి.దశరథ నాయుడు, అర్కె బాబు, జి.రమేష్, కేజీఎం రావు, బీవీ రమణ, క్రిష్ణగిరి రసూల్ పాల్గొన్నారు.

కర్నూలు కలెక్టరేట్: స్థానిక బిర్లా గేట్ సమీపంలోని గాంధీ విగ్రహం వద్ద నారా లోకేశ్ జన్మదిన వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రాగిరి చంద్రప్ప అధ్యక్షత వహించగా.. రాష్ట్ర శాలివాహన ఫెడరేషన్ మాజీ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ బత్తిన వెంకట్రాముడు, టీడీపీ రాష్ట్ర గిరిజన విభాగం రాష్ట్ర కార్యదర్శి వెంకటపతి, టీడీపీ రాష్ట్ర నాయకుడు బత్తిని లోకనాథ్ హాజరై మాట్లాడారు. టీఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్, గిరిజన నాయకుడు రాజారామ్ నాయక్, ఏఎస్ఏ రాష్ట్ర కార్యదర్శి మధుకృష్ణ పాల్గొన్నారు.

కర్నూలు లీగల్: కర్నూలు బార్ అసోసియేషన్ కార్యాలయంలో టీడీపీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో మంత్రి లోకేశ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు కేతు జగదీష్, రాష్ట్ర ఉపా ధ్యక్షుడు దాసెట్టి శ్రీనివాసులు ఆధ్వర్యంలో న్యాయవాదులు కేక్ కట్ చేశారు. లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి నాగముని, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు మోహన్ బాబు, రంగరవికుమార్ పాల్గొన్నారు.

కల్లూరు: 19వ వార్డు మారుతీనగర్‌లో నారా లోకేశ్ జన్మదినాన్ని పుర్కరించుకుని ఏర్పాటు చేసిన మోగా రక్తదాన శిబిరంలో పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంక టరెడ్డి పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నారా లోకేశ్ రాష్ట్రంలో యువగళం పాదయాత్ర చేపట్టి రాజకీయాల్లో పెను మార్పును సృష్టించారన్నారు. వార్డు ఇన్‌చార్జ్ ప్రభాకర్‌యాదవ్, మాజీ మార్కెట్‌యార్డ్ చైర్మన్ పెరుగు పురుషోత్తంరెడ్డి, పాణ్యం వాణిజ్య విభాగం అధ్యక్షుడు బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, పల్లె నాగిరెడ్డి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

బిర్లా కాంపౌండ్‌లో.. మంత్రి నారా లోకేశ్ జన్మదిన వేడుకలను కల్లూరు మండల టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. గురువారం నగరంలోని బిర్లాకంపౌండ్‌లో కేక్‌కట్ చేసి మిఠాయిలు పంచి సంబరాలు జరుపుకున్నారు. ఈసందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ నారా లోకేష్ రాష్ట్రంలో విద్యావ్యవస్థలో సంస్కరణలు తీసుకువస్తున్నారని, పరిశ్రమల స్థాపనకు నడుంబిగించి వేలకోట్ల నిధులు రాబడుతున్నారని కొనియాడారు. కార్యక్రమంలో కర్నూలు మార్కెట్‌యార్డ్ మాజీ వైస్‌చైర్మన్ కూరపాటి దేవేంద్రారెడ్డి, వాకిటి మాదేష్, శేఖర్‌చౌదరి, లక్ష్మీపురం పుల్లారెడ్డి, కొంగనపాడు టి.వినోద్ కుమార్, మాజీ కర్నూలు కూడా డైరెక్టర్ చిన్నమారెన్న, దామోదర్‌రెడ్డి, కుర్వ ధనుంజయ, బొల్లవరం రమణారెడ్డి, ప్రసాద్‌గౌడ్, నెరవాడ జాఫర్, కె.మహేష్‌గౌడ్, తిరుమలేష్ పాల్గొన్నారు.

ఓర్వకల్లు: మండలంలోని పలు గ్రామాల్లో నారా లోకేశ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. హుశేనాపురంలో టీటీడీ బోర్డు సభ్యుడు మల్లెల రాజశేఖర్, నన్నూరులో టీడీపీ సీనియర్ నాయకుడు విశ్వేశ్వరరెడ్డి కేక్ కట్ చేశారు. నాయకులు కేవీ మధు, మహబూబ్ బాషా, బజారు, సుధాకర్, నాగరాజు, ఖాజామియా, విజయుడు, ప్రతాప్ రెడ్డి, కాకి దేవేంద్ర, అన్వర్‌బాషా పాల్గొన్నారు.

● మండల కేంద్రమైన ఓర్వకల్లులో మంత్రి నారా లోకేశ్ జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. నాయకులు భాస్కర్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, శ్రీరామిరెడ్డి, అబ్దుల్లా, అల్లా బాబు, యాసిన్‌బాషా, అయూబ్ బాషా, హర్షవర్ధన్, సంజీవ పాల్గొన్నారు.

కర్నూలు రూరల్: కర్నూలు మండలం పసుపుల గ్రామంలో కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి తన స్వగృహంలో మంత్రి నారా లోకేశ్ జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే తన తల్లి పసుపుల సర్పంచు బొగ్గుల శీల మ్మతో కలిసి కేక్‌ను కట్ చేయించారు. కార్యక్రమంలో టీడీపీ నాయ కులు సూదిరెడ్డిపల్లె వెంకట్రాముడు, తాండ్రపాడు సర్పంచు ఆకెపోగు జయన్న, పసుపుల ఉపసర్పంచు మోహన్ పాల్గొన్నారు.

కర్నూలు కల్చరల్: మంత్రి నారా లోకేశ్ జన్మదినం సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నగరూరు రాఘవేంద్ర అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గురువారం నగరంలోని రైల్వే స్టేషన్ సమీపంలోని పట్టణ నిరాశ్రయుల వసతి గృహం వద్ద ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో రాఘవేంద్ర మాట్లాడుతూ టీడీపీ యువత నేత లోకేశ్ సుఖ సంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షించారు. బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు పోలంకి రామస్వామి, శ్రీధర్, సూర్య పాల్గొన్నారు.

కోడుమూరు: మంత్రి నారా లోకేశ్ జన్మదినాన్ని పురస్కరించుకొని బృందావనం హోటల్ సమీపంలో టీడీపీ నాయకులు గోపాల్‌నా యుడు, బడేసాగౌడ్ సమక్షంలో కేక్‌ను కట్ చేశారు. బ్రిటీష్ రాముడు, బాలకృష్ణ, నారాయణ, మధు, రాముడు, కర్ణ, క్రిష్ణ పాల్గొన్నారు.

గూడూరు: మండలంలోని ఆర్ ఖానాపురంలో మండల తెలుగు యువత అధ్యక్షుడు సుమన్ బాబు ఆధ్వర్యంలో నారా లోకేశ్ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేశారు. సర్పంచ్ మునిస్వామి, టీడీపీ నాయకులు కృష్ణుడు, నరసింహులు, పెద్ద తిమ్మప్ప, దస్తగిరి, పింజరి సుభాన్ పాల్గొన్నారు.

సి.బెళగల్: నారా లోకేశ్ జన్మదినం సందర్భంగా మాజీ జడ్పీటీసీ చంద్రశేఖర్ టీడీపీ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. టీడీపీ మండల సీనియర్ నాయకుడు బాలాజీ వెంకటేశ్, నాయకులు హనుమంతు గౌడు, దస్తగిరి, నాగరాజు, విద్యాకమిటీ చైర్మన్ గోవిందు పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న కల్లూరు మండల టీడీపీ నాయకులు, నన్నూరులో.. బిర్లా గేట్ సమీపంలో.. కోడుమూరులో.. గూడూరులో..



ఆర్‌యూలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యేలు, వీసీ


హుశేనాపురంలో..


పసుపులలో..


టీడీపీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో..


సి. బెళగల్‌లో..

చెత్తబావి



మండలంలోని పైచింతలకొండ, మామళ్లకుంట, పగిడిరాయి, శభాష్‌పురం తదితర గ్రామాల్లోని బావుల్లో చెత్త వేస్తున్నారు. ఈ బావుల్లో నీరు ఉన్నా నిరుపయోగంగా మారాయి. చెత్తను తొలగించకపోవడంతో దుర్వాసన వస్తోంది. పంచాయతీ అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు. - తుగ్గలి

మురుగు కుంట



గ్రామంలోని మాలవీధి తంబులకుంటలోకి మురుగు చేరి దుర్వాసన వస్తోందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని, చిన్నారులు మలేరియా, జ్వరాల బారిన పడుతున్నారని కుంటను పూడ్చాలని కోరుతున్నారు. - మద్దికెర

పశువుల పట్ల అప్రమత్తంగా ఉండండి

తుగ్గలి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): పశువులకు వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పశువైద్యాధికారి బాలకృష్ణ సూచించారు. గురువారం మండలంలోని జొన్నగిరిలో పశువులకు టీకాలు వేశారు. నట్టల నివారణ, వ్యాధులకు టీకా, యాంటీ రేబీస్, నట్టల నివారణ మందులు స్థానిక పశువైద్యశాలలో అందుబాటులో ఉన్నాయన్నారు. పాడి రైతులు తమ పశువులు, జీవాలకు క్రమం తప్పక టీకాలు వేయించాలని సూచించారు.

పంచాయతీకి మార్కెట్ అప్పగింత



పత్రాలను అప్పగిస్తున్న నాబార్డు అధికారులు

మద్దికెర, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక మెయిన్‌బజారులో నాబార్డు నిధులు రూ.8లక్షలతో నిర్మించిన కూరగాయల మార్కెట్‌ను గురువారం పంచాయతీకి అప్పగించారు. గురువారం నవ యూత్ అసోసియేషన్ సీఈవో నరసింహులు, కెనరా బ్యాంకు మేనేజర్ వెంకటేశ్‌గౌడ్ నాబార్డు సభ్యులు పత్రాలను సర్పంచ్ బండారు సుహాసిని, కార్యదర్శి శివకుమార్‌కు అందజేశారు. సర్పంచ్ మాట్లాడుతూ దాత మాజీ సర్పంచ్ కొత్తపేట వెంకటేశ్వరరెడ్డి రూ.3 లక్షల విరాళం, నాబార్డు నిధులు రూ.15లక్షలు, పంచాయతీ నిదులు రూ.4 లక్షలు మొత్తం రూ.22 లక్షలతో మార్కెట్‌ను నిర్మించామన్నారు. ఉప సర్పంచ్ వి.నాగేశ్వరరెడ్డి, కమిటి సభ్యులు కూరగాయల నాణేంద్ర, రామ్మోహన్, తదితరులు ఉన్నారు.

విద్యుత్ మోటర్ తీగల చోరీ

వెల్దుర్తి/టౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బ్రహ్మగుండం వద్ద ఉన్న మోటార్ల తీగలు చోరీ అయ్యాయని పంచాయతీ అధికారులు తెలిపారు. రాత్రి దుండగులు దాదాపు 160 మీటర్ల వైర్లను కట్ చేసి అపహరించారని, విలువ రూ.30 నుంచి రూ.40వేల వరకు ఉంటుందని వివరించారు. వెల్దుర్తికి తాగునీటిని సరఫరా చేసేందుకే ఈ రెండు మోటార్ల ద్వారానే సరఫరా చేస్తామన్నారు.

కందులు కొనుగోలు చేయాలి



వినతి పత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

పత్తికొండ టౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): డివిజన్ పరిధిలో రైతులు పండించిన కందులను ప్రభుత్వం కొనుగోలు చేయాలని సీపీఎం కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ఆర్డీవో కార్యాలయ అధికారులకు వినతి పత్రం ఇచ్చారు. పత్తికొండ రెవెన్యూ డివిజన్ పరిధిలో 10వేలకు పైగా ఎకరాల్లో కంది సాగు చేశారన్నారు. కందులను తూర్పారబట్టి నిల్వ చేసుకున్నారని ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామని చెప్పి స్పందించడం లేదన్నారు. ప్రైవేటు వ్యాపారులకు విక్రయించి రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేవారు. మద్దతు ధరతో కొనుగోలుచేసి రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు రంగారెడ్డి, రాజేశ్వరరెడ్డి, నారాయణ, సీఐటీయూ నాయకులు గోపాల్, మహబూబ్ బాషా, చుక్కప్ప, తదితరులు పాల్గొన్నారు.

పని వేళలు పాటించకుంటే చర్యలు

ఆదోని రూరల్ జనవరి 23 (ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగులు పని వేళలు పాటించకుంటే చర్యలు తప్పవని ఎంపీడీవో రాజేంద్ర ప్రసాద్ హెచ్చరించారు. గురువారం మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు బయో మెట్రిక్ హాజరు వేయాలని ప్రభుత్వ సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు చేరవేయాలని, పథకాల వివరాలతో సచివాలయాల్లో గోడ పత్రికలు అంటించాలన్నారు.

వృద్ధులకు అన్నదానం

పత్తికొండ టౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): బెంగాల్ వాసి జ్ఞాపకార్థం పట్టణంలోని వృద్ధాశ్రమంలో పెద్దహుల్తి గ్రామస్థులు అన్నదానం చేశారు. ఏడేళ్ల క్రితం బెంగాల్ మహిళను పెద్దహుల్తి గ్రామస్థులు చేరదీశారు. ఆమె అనారోగ్యంతో మృతి చెందడంతో ఆమె జ్ఞాపకార్థంగ్రామస్థులు పత్తికొండ పట్టణంలోని హోసూరు రోడ్డులో ఉన్న వృద్ధాశ్రమంలో అన్నదానం నిర్వహించారు. గ్రామస్థులు కారన్న, రాజప్ప, హుల్తన్న, అశోక్, నరసప్ప, సిద్ధు, ఉపేంద్ర పాల్గొన్నారు.

కర్నూలుకు తరలిన బీజేపీ నాయకులు

ఆదోని టౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ దినకర్ జిల్లాకు వస్తుండటంతో అభివృద్ధికి అవకాశం కలిగిందని బీజేపీ నాయకులు వెల్లాల మధుసూదన్ శర్మ, పంపావతి అన్నారు. ఎమ్మెల్యే పార్థసారథి ఆదేశాల మేరకు గురువారం కర్నూలుకు బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు వెల్లాల లలితమ్మ, చెన్న, సురేష్ సర్పంచులు ధనాపురం చంద్ర, చిలక జయరాం. నాగలాపురం వీరారెడ్డి, కల్లుపోతుల సురేష్, నూర్జహాన్, రంగన్న పాల్గొన్నారు.

వైసీపీ లీగల్ సెల్ అధ్యక్షుడిగా లక్ష్మీకాంత్



ఆలూరు రూరల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ వైసీపీ లీగల్ సెల్ అధ్యక్షుడిగా బి లక్ష్మీకాంత్‌ను నియమించారు. లక్ష్మీకాంత్ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. కార్యకర్తల న్యాయపరమైన సమస్యలను పరిష్కరిస్తానని చెప్పారు. ఎమ్మెల్యే విరుపాక్షి, అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

వేతనాలు పెంచాలి

వెల్దుర్తి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): తమకు వేతనాలు పెంచాలని అంగనవాడీ కార్యకర్తలు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డికి అసోసియేషన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లలితమ్మ వినతి పత్రాన్ని సమర్పించారు.

టీడీపీతోనే యువత అభివృద్ధి

తుగ్గలి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీతోనే యువత అభివృద్ధి చెందుతారని ఆ పార్టీ నాయకుడు వెంకటస్వామి, మిద్దె వెంకటేశ్ యాదవ్ అన్నారు. గురువారం మండలంలోని జొన్నగిరిలో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం యువతను నట్టేట ముంచిందని ఆరోపించారు. సచివాలయ ఉద్యోగాలు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకున్నారని అన్నారు. మరో పోస్టు ఇవ్వకుండా మోసం చేశారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పరిశ్రమలు తీసుకువస్తున్నారని, పోలీసు ఉద్యోగాలకు నోటిఫికేషన్లు విడుదల చేసిందన్నారు.

స్టడీ మెటీరియల్ విడుదల



మెటీరియల్‌ను విడుదల చేస్తున్న ఎంఈవో కోమల దేవి

ఆలూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థుల కోసం ఎస్టీయూ రూపొందించిన 'వంద శాతం ఫలితాలు సాధిద్దాం' పుస్తకాలను గురువారం ఎంఈవోలు కోమల దేవి, చిరంజీవి రెడ్డి ఆవిష్కరించారు. విద్యార్థుల సౌలభ్యం కోసం ఈ మెటీరియల్‌ను పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ మండల అధ్యక్షుడు అశ్విని కుమార్, ప్రధాన కార్యదర్శి రమేష్, మండల ఆర్థిక కార్యదర్శి సౌర్య నారాయణ సీనియర్ నాయకులు, గిరయ్య, సురేష్, సోమన్న, నేమ్ కల్ నాగరాజు, రాకృష్ణ, విజయ రాధ, సాయి కుమార్ పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం చేస్తున్న స్నేహితులు

వెల్దుర్తి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల 2004-05 పదో తరగతి విద్యార్థి బాబురావు ఇటీవల మృతిచెందాడు. దీంతో మిత్రులు స్నేహితుడి కుటుంబాన్ని ఆదుకునేందుకు ముందుకు వచ్చారు. రూ.30 వేలు అందించారు.

ఐఆర్ ప్రకటించకుంటే ఉద్యమం

ఆదోని అగ్రికల్చర్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయులకు మధ్యంతర భృతి ప్రకటించకుంటే ఉద్యమం చేస్తామని ఎస్టీయూ ఉపాధ్యక్షుడు నాగరాజు, పురపాలక కన్వీనర్ వీరచంద్ర యాదవ్ హెచ్చరించారు. గురువారం నెహ్రూ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో సమావేశం నిర్వహించారు. 11వ పీఆర్సీ గడువు ముగిసి 16 నెలలైనా 12వ పీఆర్సీ ఊసే లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. అధ్యక్ష కార్యదర్శులు రవి, భీమరాజు, ప్రహ్లాద, ప్రసాద్, సుధాకర్, జయరాం, నిరంజన్ రెడ్డి పాల్గొన్నారు.

నేతాజీ సేవలు మరువలేనివి

మద్దికెర, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): దేశం కోసం ప్రాణాలర్పించిన నేతాజీ సుభాష్ చంద్రబోస్ సేవలు మరువలేనివని విద్యాసాయి కళాశాల ఎండీ వెంకట మాధవ అన్నారు. గురువారం పాఠశాలలో చంద్రబోస్ చిత్రపటానికి నివాళి అర్పించారు. దేశం స్వాతంత్ర్యం కోసం బ్రిటీష్‌వారితో పోరాడి ప్రాణాలర్పించిన మహనీయుడు నేతాజీ అన్నారు. ప్రిన్సిపాల్ బాలసునీత ఉన్నారు.

పత్తికొండ టౌన్: దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన నేతాజీ స్ఫూర్తిని కొనసాగించాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రంగస్వామి, న్యాయవాదులు ఎల్లారెడ్డి, మైరాముడు, సత్యనారాయణ పిలుపునిచ్చారు. గురువారం బార్ అసోసియేషన్ కార్యాలయంలో నేతాజీ జయంతి సందర్భంగా నివాళి అర్పించారు. లక్ష్మన్న, నాగేష్, మల్లికార్జున, నరసింహయ్య, దామోదరాచారి, మహేష్ పాల్గొన్నారు.

భవిష్యత్ నాయకుడు లోకేష్

దేవనకొండ,జనవరి 23 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్ నాయకుడు మంత్రి లోకేశ్ అని వాల్మీకి కార్పొరేషన్ చైర్‌పర్సన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ అన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో లోకేష్ జన్మదినం వేడుకలు నిర్వహజించారు. కన్వీనర్ విజయభాస్కర్ గౌడ్, రామచంద్ర నాయుడు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న బొజ్జమ్మ

లారీ స్కూటర్ ఢీ

- ఒకరి మృతి

ఆస్పరి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అలిగేర, చిగిలి బస్‌స్టాప్ వద్ద ఆదోని రోడ్డులో లారీ ద్విచక్ర వాహనం డీకొని బిణిగేర గ్రామానికి చెందిన ఈరేంద్ర (23) మృతి చెందాడు.

వివరాలు.. వీరేంద్ర ఆస్పరిలోని పత్తి అంగిడిలో పని చేసి, తిరిగి గ్రామానికి చేరుకున్న తరుణంలో చిగిలి సమీపంలో, ఆదోని నుంచి పత్తికొండకు వెళ్తున్న లారీ ఢీకొంది.అక్కడికక్కడే మృతి చెందాడు. తల్లిదండ్రులు నాగేషు, గోవిందమ్మ బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మస్తాన్ వలి తెలిపారు.

ఆహార కిట్ల పంపిణీ

ఆదోని టౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ప్రైయివేటు వైద్యులు మనోజ్ కుమార్, మనీషా టీబీ బాధితులకు రూ.వెయ్యి విలువచేసే పోషక ఆహార కిట్లను గురువారం పంపిణీ చేశారు. మెడికల్ ఆఫీసర్ డా. శేకున్ భాను, డా. శాంతి, డా సుధాకర్, జిల్లాకో ఆర్డినేటర్ ఉమాపతి, ఎంపీహెచ్‌ఎస్ బాబు రాజు పాల్గొన్నారు.

టీడీపీతోనే అభివృద్ధి

మద్దికెర, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని జిల్లా టీడీపీ కార్యవర్గ సభ్యుడు ఎన్.లక్ష్మినారాయణ అన్నారు. ఎమ్మెల్యే శ్యాంబాబు చొరవతో మద్దికెర నుంచి బురుజులకు తారోడ్డుకు రూ.5 కోట్లు మంజూరు చేయించారన్నారు. చంద్రశేఖర్‌గౌడ్, గొడుగు సతీష్ కుమార్, భీమరాజు అటన్నారు.

రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

వెల్దుర్తి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని సూదేపల్లె గ్రామానికి చెందిన రమణమ్మ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. స్థానిక జయరాముడు ఎమ్మెల్యే శ్యాంబాబు దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే సీఎం సహాయనిధి కింద రూ.4,52,877ల చెక్కును గురువారం కర్నూలులో జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, కుడా చైర్మన్ వెంకటేశ్వర్లు చేతుల మీదిగా అందజేశారు.

ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు : డీఎస్పీ



మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటరామయ్య

ఆస్పరి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): దేవరలో ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య హెచ్చరించారు. గురువారం స్థానిక అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే వదిలిపెట్టమన్నారు. సీఐ మస్తాన్ వలి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నైపుణ్యముంటే ఉద్యోగాలు



మాట్లాడుతున్న ప్లేస్‌మెట్ అధికారి బాబా ఫకృద్దీన్

ఆదోని అగ్రికల్చర్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): యువతలో నైపుణ్యముంటే ఉద్యోగాశాలు లభిస్తాయని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ మురళీమోహన్, ప్లేస్‌మెంట్ అధికారి బాబా ఫక్రుద్దీన్ అన్నారు. గురు వారం కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించారు. విద్యార్థులు వృత్తి నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. ఆల్‌డీజీ టెక్నాలజీ చెన్నై, బెంగళూరు కంపెనీ ప్రతినిదులు 28 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. అధ్యాపకులు డాక్టర్ అయ్యప్ప, యుగంధర్ రెడ్డి, వన్నూర్, రామకృష్ణ పాల్గొన్నారు.

సీసీ రోడ్లకు ప్రతిపాదనలు



కొలతలు తీసుకుంటున్న అధికారులు

మద్దికెర, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 11 గ్రామాల్లో నూతన సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.కోటితో ప్రతిపాదనలు పంపామని పీఆర్ ఏఈ విష్ణువర్దన్ అన్నారు. గురువారం ఈమేరకు సాయినగర్ కాలనీలో ప్రతిపాదనలకు కొలతలు వేశారు. మండల ంలో మొత్తం 38 పనులకు గానూ 37 పనులు పూర్తయ్యాయన్నారు. తెలుగు యువత అధ్యక్షుడు ఈడిగ చంద్రశేఖర్‌గౌడ్ ఉన్నారు.

వలసల నివారణ బాధ్యత

ఆదోని రూరల్ జనవరి 23 (ఆంధ్రజ్యోతి): వలసలను నివారించడం మన బాధ్యత అని సీఎల్ఆర్సీ ఏపీడీ కృష్ణమోహన్, ఆదోని క్లస్టర్ ఏపీపీ లోకేష్ పేర్కొన్నారు. గురువారం వ్యవసాయ సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి, సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఏపీడీ కృష్ణమోహన్, లోకేష్ మాట్లాడుతూ కూలీలు వలస వెళ్లకుండా ప్రభుత్వం ప్రణాళిక రూపొందించిందన్నారు. అడిగిన ప్రతి ఒక్కరికి ఉపాధి పనులు కల్పిస్తున్నామని వినియోగించుకోవాలని కోరారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గౌస్ దేశాయ్, వ్యవసాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీ నారాయణ, లింగన్న, వీరేశఖర్, తిక్కన్న, రామాంజనేయులు ఉన్నారు.

'హత్య కేసు నిందితుడు బీజేపీ అధ్యక్షుడా..'



మాట్లాడుతున్న మాల మహానాడు అధ్యక్షుడు మహానంది

ఆలూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): దళితుల హత్య కేసు నిందితుడు రామకృష్ణకు బీజేపీ జిల్లా అధ్యక్ష పదవిని ఎలా ఇచ్చారని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మహానంది ప్రశ్నించారు. గురువారం మాట్లాడుతూ కొత్తాళం మండలం కామవరం గ్రామంలో 2022 జనదరి 27న దళితులపై పట్టపగలు పెట్రోల్ పోసి నిప్పంటించిన కేసులో నిందితుడు రామకృష్ణకు బీజేపీ అధిష్టానం అధ్యక్ష పదవి ఇవ్వడం సరికాదన్నారు. ఇది పార్టీ నైతికతకు నిదర్శనమన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరికి లేఖ రాస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో కన్వీనర్ భరత్, రామాంజినేయులు,రంగస్వామి, మల్లికార్జున ఉన్నారు.

మంత్రి లోకేశ్ జన్మదిన వేడుకలు

- ఆలూరులో రక్తదానం, బైక్ ర్యాలీ
- ఆదోని, పత్తికొండలో కేక్ కట్ చేసిన నాయకులు



ఆదోనిలో కేక్‌కట్ చేస్తున్న టీడీపీ నాయకుడు ఉమాపతి నాయుడు



పూజలు చేస్తున్న కురవ కార్పొరేషన్ చైర్మన్ మాన్వి దేవేంద్ర



ఆలూరులో వైకుంఠం శివప్రసాద్, జ్యోతి, కపట్రాల బొజ్జమ్మ..

ఆదోని అగ్రికల్చర్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ జన్మదిన వేడుకలను పట్టణంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు నిరవహించారు. పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు ఆధ్వర్యంలో ఉమాపతి నాయుడు కేక్‌కట్ చేశారు. లోకేష్ నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించే లక్ష్యంగా పెట్టుబడులను తీసుకొచ్చేందుకు కష్టపడుతున్నా రన్నారు. డీస్ట్రిబ్యూటరీ కమిటీ మాజీ చైర్మన్ బసాపురం రామస్వామి, తెలుగు యువత వెంకటేష్, హనవాళ్లు మాభాష, పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

లోకేష్ జన్మదినాన్ని పురస్కంచుకొని పెద్ద హరివాణం గ్రామంలో కురువ కార్పొరేషన్ చైర్మన్ మాన్వి దేవేంద్రప్ప ఆధ్వర్యంలో సాయిబాబా ఆలయంలో పూజలు చేశారు. ముందుగా కేక్ కట్ చేసి కార్యకరలకు పంచిపెట్టారు.

లోకేష్ సారథ్యంలో అభివృద్ధి

ఆలూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మంత్రి లోకేష్ సారథ్యంలో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ కపట్రాళ్ళ బొజ్జమ్మ, టీడీపీ ఆర్గనైజింగ్ కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్, జ్యోతి అన్నారు. గురువారం పట్టణంలో లోకేష్ జన్మదినం సందర్భంగా బైక్ ర్యాలీ నిర్వహించి, ఆర్అండ్‌బీ అతిథి గృహంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ముందుగా వైకుంఠం జ్యోతి రక్తదానం చేయగా, అనంతరం 160 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రామచంద్ర నాయుడు శేషగిరి, ఉచ్చిరప్ప, బిలేకల్ వెంకటేష్, ఏరూర్ మహేష్, జడ్పీటీసీ లింగప్ప, కన్వీనర్లు విజయ్, పేక్షవల్లి, తిప్పయ్య పాల్గొన్నారు.

ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్ తనయుడు గిరి మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో భారీ ఎత్తున కార్యకర్తలు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పార్టీ కార్యాల యంలో కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. జూనియర్ కళాశాల్లో విద్యార్థినులకు ప్లేట్లు పంపిణీ చేశారు. లోకేష్ రాష్ట్ర అభివృద్ధికి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆలూరు కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుడు నగరడోణ కిష్టప్ప, నాయకులు రాంనాథ్ యాదవ్, రఘు ప్రసాద్ రెడ్డి, అట్టెకల్ జగన్మోహన్ బాబు, నరసప్ప, ముద్దురంగ, సుబాన్, సురేంద్ర, రామాంజినేయులు, కొమ్ము రాజు, పాల్‌రెడ్డి, సోమశేకర్, మసాలా జగన్, రాము ఆయదవ్, ఈరన్న, మల్లికార్జున, కిట్టు, వన్నూరు వల్లి పాల్గొన్నారు.



ఆలూరులో కేక్ కట్ చేస్తున్న గిరి మల్లేష్ గౌడ్



పత్తికొండ టీడీపీ కార్యాయలంలో..

పత్తికొండ: పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో గురువారం మంత్రి నారా లోకేశ్ జన్మదినవేడుకలను నిర్వహించారు. సాంబశివారెడ్డి, మనో హర్‌చౌదరి, రామానాయుడు కేక్ కట్‌చేశారు. లోకేష్ యువగళం పాదయాత్ర చేసి తండ్రికితగ్గ తనయుడిగా గుర్తింపు తెచ్చుకున్నా రన్నారు. కడవల సుధాకర్, మునినాయుడు, శ్రీనివాసులు, చాకలిహుల్తెప్ప పాల్గొన్నారు.

హాలహర్వి: మండల కేంద్రంలో మంత్రి లోకేష్ జన్మదిన వేడుకలు సర్పంచ్ మల్లికార్జున నిర్వహించారు. కన్వీనర్ సుధాకర్, ప్రహ్లాదరెడ్డి పాల్గొన్నారు.

వెల్దుర్తి టౌన్: పట్టణంలోని పార్టీ కార్యాలయంలో తెలుగు యువత అధ్యక్షుడు సుధాకర్‌గౌడ్ వేడుకలు నిర్వహించారు. బొమ్మిరెడ్డిపల్లె సుబ్బరాయుడు కేక్ కట్ చేశారు. తిరుమలేష్ గౌడ్, రామకృష్ణాచారి, నర్సాపురం రాముడు, బజారు, వెంకట్రాముడు, రామచంద్రుడు, రాంబాబు పాల్గొన్నారు.

ఆస్పరి: విద్యాశాఖ మంత్రి లోకేశ్ 42వ జన్మదిన వేడుకలను గురువారం ఆస్పరిలో టీడీపీ నాయకులు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు కృష్ణ యాదవ్, వెంకటేష్, ఎస్ తిమ్మన్న, గోవిందు, మహానంది స్వామి, ఎంపీటీసీ నర్సప్ప, రహీంతుల్లా, సుదర్శన్, రాజశేఖర్ సతీష్ కుమార్, యుగంధర్, రాజశేఖర్, రంగనాథ్ పాల్గొన్నారు.

మూటాముల్లై సర్దుతున్న పల్లె

● రోజుకు పది వాహనాల్లో వలస
● ఖాళీ అవుతున్న గ్రామాలు

గోనెగండ్ల, జనవరి 23(ఆంధ్రజ్యోతి): మండలంలో రోజురోజుకూ వలసలు పెరుగుతున్నాయి. రోజుకు పది వాహనాల్లో ఎక్కడ పనులు అక్కడికి వలస వెళ్తున్నారు. గురువారం ఐరన్‌బండ, గోనెగండ్ల గ్రామాల నుంచి దాదాపు పది బొలేరో వాహనాల్లో వ్యవసాయ కూలీలు, చిన్న, సన్నకారు రైతులు వలస బాట పట్టారు. సంక్రాంతి పండుగ ముగియడంతో అందరూ పనుల బాట పట్టారు. ఐరన్ బండ గ్రామం నుంచి గురువారం దాదాపు 30 కుటుంబాలు గుంటూరుకు వలసపోయాయి. అక్కడ మిర్చి పనుల్లో పని కుదుర్చుకున్నారు. మిర్చి పంట తెంపితే రూ.450, పంటను రోడ్డుకు మోసేందుకు గాను ఒకరికి రూ.600 ప్రకారం మూడు పూటల భోజనం కూడా పొలం యజమానే ఏర్పాటు చేస్తారు. అలాగే రాజంపేట, సంగారెడ్డి జిల్లా జోగిపేట మండలం ముసలపూర్ గ్రామాలకు కూడా కొంతమంది వలస వెళ్లారు. అక్కడ పత్తి, వేరుశనగ పంటలను తీసేందుకు కూలి కుదుర్చుకున్నారు. కేజీ పత్తికి రూ.12 నుంచి రూ.14 ఇస్తారు. దీంతో గ్రామాలు నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. స్థానికంగా పొలం పనులు లేకపోవడం వల్లే వలసలు పోతున్నట్లు కూలీలు తెలుపుతున్నారు. గుంటూరు, తెలంగాణ ప్రాంతాల్లో పత్తి పొలాల్లో పనులు ఉన్నాయని, అక్కడ ఉగాది పండుగ వరకు పనులు చేసుకొని


గోనెగండ్ల నుంచి వలస వెళ్తున్న కూలీలు

వస్తామని కూలీలు చెబుతున్నారు. మండలంలోని పలు గ్రామాల నుంచి ఇప్పటి వరకు దాదాపు 2,000 కుటుంబాలు వలసపోయినట్లు తెలుస్తోంది. మండలంలో 16,407 జాబ్ కార్డులు ఉన్నాయి. అందులో 33,378 మంది ఉపాధి కూలీలు ఉన్నారు. అధికారులు పనులు కల్పించడం లేదని కూలీలు తెలుపుతున్నారు. అధికారుల లెక్కల ప్రకారం మండలంలోని 27 గ్రామాల్లో ఉపాధి పనులకు 1825 కూలీలు మాత్రమే హాజరవుతున్నట్లు సమాచారం.

రూ.750 కోట్లతో వాటర్ గ్రిడ్‌కు ప్రతిపాదనలు

గోనెగండ్ల, జనవరి 23(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు తాగు నీరందించేందుకుగాను రూ.750 కోట్లతో వాటర్‌గ్రిడ్ పనులకు ఎస్టిమేట్ తయారు చేసి ప్రభుత్వానికి పంపినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరెడ్డి తెలిపారు. గురువారం ఎంపీడీవో సమావేశ భవనంలో మండల సభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ నసూరుద్దీన్ అధ్యక్షత వహించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతితో గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి 0.9 టీఎంసీ నీటిని తీసుకొని వాటర్ గ్రిడ్ ఏర్పాటు చేసి అందుకు కావాల్సిన పైపులైన్, వాటర్ ట్యాంక్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపినట్లు ఆయన తెలిపారు. రూ.32 కోట్లతో మండలంలోని జలజీవన్‌మిషన్ పనులు చేపడుతున్నామని చెప్పారు. మండలంలో పలు గ్రామాల్లో పల్లె పండుగ కింద సీసీ రోడ్డు డ్రైనేజీ పనులకు గాను మరో రూ.2 కోట్లు కేటాయించారని, ఆ నిధులతో పనులు చేయించినట్లు రెండో విడత కింద రూ.1.27 కోట్లు మంజూరు కాగా ఆ పనులు కూడా చేస్తున్నట్లు పీఆర్ ఏఈ శివశంకర్ తెలిపారు. అయితే గోనెగండ్ల మండల ఉపాధ్యక్షుడు వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ జిల్లా పరిషత్ నుంచి మండలానికి అభివృద్ధి పనుల కింద రూ. 15 లక్షలు నిధులు విడుదలయ్యాయి. అయితే ఎస్టిమేషన్ వేయమని అడిగితే ఎమ్మెల్యే చెప్పాలని అనడం ఏంటని ఆయన ప్రశ్నించారు. మార్చిలోపే పనులు పూర్తి చేయాలి లేకపోతే నిధులు వెనక్కి పోతాయి కదా అని వెంకటరామిరెడ్డి ప్రశ్నించారు. రాజకీయాలు పక్కన పెట్టండి అభివృద్ధికి


వైస్ ఎంపీపీ, పీఆర్ ఏఈ మధ్య వాగ్వాదం

అధికారులు ప్రాధాన్యం ఇవ్వాలని మండల ఉపాధ్యక్షుడు అన్నారు. హౌసింగ్ ఏఈ మాట్లాడుతూ మండలంలో 1176 గృహాలు మంజూరయ్యాయని అందులో 434 మాత్రమే పూర్తి కాగా మిగతావి పలు స్టేజిలలో ఉన్నాయని తెలిపారు. మార్చి 31 లోపు గృహ నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని కోరారు. తహసీల్దార్ కుమార స్వామి మాట్లాడుతూ గ్రామాల్లో రీ సర్వే జరుగుతోందని, అందుకు ప్రజలు నాయకులు సహకరించాలని కోరారు. ఈవోఆర్‌డీ మాట్లాడుతూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. ఏవో హేమలత, ఎంఈవో రామాంజినేయులు, ఉపాధి హామీ ఏపీఎం మహ బూబూబ్ బాషా, ఇతర అధికారులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మణిమంజరి పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

రైతులకు అందుబాటులో ఉంటున్నాం

● మండల వ్యవసాయాధికారి వరప్రసాద్



పెద్దకడుబూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): రైతులకు నిత్యం అందుబాటులో ఉంటున్నామని మండల వ్యవసాయాధికారి వరప్రసాద్ అన్నారు. గురువారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

ప్రశ్న: మండలంలో రైతులకు ఏవిధంగా సేవలందిస్తున్నారు?

జవాబు: రైతులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వంద శాతం అందిస్తున్నాం. రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు ఇస్తున్నాం. రైతు సేవా కేంద్రాల్లో విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయి.

ప్రశ్న: నూతనంగా వచ్చిన యాప్‌ల పని తీరు ఎలా ఉంది?

జవాబు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంటల్లో చీడపీడలను నియంత్రించేందుకు ఎన్‌పీఎస్ఎస్ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. వీఏవోలు ఈ యాప్‌ను రైతు పంట పొలాల్లో ఉపయోగించి పంటలకు వ్యాపించే పురుగులు, వైరస్‌లను గుర్తించి సత్వర నియంత్రణకు చర్యలు తీసుకోవచ్చు.

ప్రశ్న: పంట ఉత్పత్తులకు మద్ద ధర ఇస్తున్నారా..?

జవాబు: రైతులకు బయట మార్కెట్‌లో మద్దతు ధర లభించనప్పుడు కేంద్ర ప్రభుత్వం నుంచి నిర్ణయించిన మద్దతు ధరతో ప్రభుత్వ ఏజెన్సీల ద్వారా కొనుగోలు చేస్తుంది. ఇందుకు అవసరమయ్యే రిజిస్ట్రేషన్ ప్రక్రియ రైతు సేవా కేంద్రాల ద్వారా జరుగుతుంది.

ప్రశ్న: పొలాల్లో కొత్త రకం చీడపీడలు ఉన్నప్పుడు వాటిని ఎలా నివారిస్తారు.?

జవాబు: ఎమ్మిగనూరులోని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలోని వ్యవసాయ శాస్త్రవేత్తలు, డాట్ సెంటర్‌లోని వ్యవసాయ శాస్త్రవేత్తల సహాయంతో క్షేత్ర సందర్శనలు నిర్వహించి చీడపీడలను నివారించడానికి తగు చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను ఎలా అరికడతారు.?

జవాబు: రైతులకు విత్తనాలు, ఎరువుల దుకాణాల్లో అమ్మకాలు జరిగేటప్పుడు నమూనాలు సేకరించి వాటిని పరీక్షా కేంద్రాలను పంపుతాం. నకిలీవని తెలిసినప్పుడు చర్యలు తీసుకుంటాం.

గ్రామాల్లో ప్రశాంతంగా జీవించాలి: ఎస్ఐ

కోసిగి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అగసనూరు గ్రామంలో పార్టీలకతీతంగా అందరూ ప్రశాంతంగా జీవించాలని ఎస్ఐ చంద్రమోహన్ అన్నారు. అలాగే గ్రామాల్లో దొంగతనాలు జరిగితే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. గురువారం అగసనూరు-సాతనూరు గ్రామాల్లో గ్రామస్తులకు శాంతి భద్రతలపైన అవగాహన కల్పించారు.

గజ వాహనంపై ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, జనవరి 23(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు రజత గజ వాహనంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. పుష్యమాస నవమి, రాఘవేంద్ర స్వామికి ఇష్టదినమైన గురువారం శుభదినాన్ని పురస్కరించుకుని మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో తెల్లవారుజామునుంచే రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి, మంచాలమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మఠానికి రూ.10 లక్షల విరాళం

మంత్రాలయం, జనవరి 23(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠానికి చెన్నైకి చెందిన చంద్రశేఖర్ అనే భక్తుడు భవన నిర్మాణానికి రూ.10 లక్షలు విరాళం ఇచ్చినట్లు మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజరు వెంకటేష్ జోషి తెలిపారు. గురువారం కుటుంబ సమేతంగా రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని చెక్కు ఇచ్చినట్లు తెలిపారు. విరాళం ఇచ్చిన దాత కుటుంబానికి పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు రాఘవేంద్ర స్వామి ఆశీర్వదించారు.

పాడి రైతుల అభివృద్ధే కూటమి ధ్యేయం

పెద్దకడుబూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): పాడి రైతుల అభివృద్ధే కూటమి ధ్యేయమని టీడీపీ నాయకులు వీరేష్ గౌడ్, శివ, డబ్ల్యూపీసీ ప్రెసిడెంట్ నారాయణ అన్నారు. గురువారం మండలంలోని చిన్నతుంబళం గ్రామంలోని పశువైద్యాధికారి జోత్స్న ఆధ్వర్యంలో పశు ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు వ్యవసాయ పంటలతోపాటు, పాడి పశువులను కూడా పోషించాలన్నారు. పశువుల ఆరోగ్య పరిరక్షణ పాల ఉత్పాదకతను పెంచడానికి, వ్యాధులు నియంత్రించాడానికి ప్రభుత్వం ఉచితంగా గ్రామాల్లో పశు ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఈ శిబిరాల ద్వారా పశువైద్య చికిత్సలు, నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది హుసేన్, టీడీపీ నాయకులు వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్, నాగరాజు పాల్గొన్నారు.

బీవీతోనే గ్రామాభివృద్ధి: టీడీపీ

నందవరం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డితోనే గ్రామాభివృద్ధి సాధ్యమని టీడీపీ నాయకులు పూలచింత సర్పంచ్ అక్క మాంబదేవి, బండేగురుస్వామి అన్నారు. గురువారం గ్రామంలోని కురవ గేరి, ఎస్సీ కాలనీలో తాగునీటి పైపులైన్ల పనులను వారు ప్రారంభించారు. అలాగే దాదాపు రూ.10 లక్షలతో సీసీ రోడ్ల పనులు చేపట్టారు. రూ.3 లక్షలతో బండేగురు మఠం ముందు సీసీ రోడ్డు పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే బీవీ అన్ని రకాలుగా గ్రామాభివృద్ధికి సహకరించి నిధులు ఇస్తున్నట్లు తెలిపారు.

రైతులను మోసం చేసిన తలారిపై కేసు నమోదు

పెద్దకడుబూరు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): రైతులు బోంపల్లి ఉసేని, విశ్వనాథ్‌లతో పాటు మరికొంత మంది ఇచ్చిన ఫిర్యాదు మేరకు తలారి తిక్కయ్యతోపాటు మరో ఇద్దరిపై పెద్దకడబూరు పోలీసులు కేసు నమోదు చేశారు. గురువారం ఎస్ఐ నిరంజన్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. తలారి తిక్కయ్య తహసీల్దార్ కార్యాలయంలో తనకు డబ్బులు ఇస్తే డీ పట్టాలు, పాసు బుక్కులు, పంటల బీమా డబ్బులు, కౌలు రైతు డబ్బులు ఇప్పిస్తామని పులికనుమ గ్రామానికి చెందిన పెద్దతుంబళం, కోసిగి గ్రామాలకు చెందిన రైతుల నుంచి రూ.4.56 లక్షల నగదును తీసుకుని వారికి నకిలీ డీ పట్టాలు, నకిలీ పాసు బుక్కులు ఇచ్చి పంపాడు. అయితే రైతులు వారికిచ్చిన డీ పట్టాలు, పాసుబుక్కులు నకిలీవని గుర్తించి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విచారించిన పోలీసులు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

యువజన అధ్యక్షుడిగా నజీర్

ఎమ్మిగనూరు టౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు నియోజకవర్గ వైసీపీ యువజన అధ్యక్షుడిగా మునిసిపల్ వైస్ చైర్మన్ నజీర్ అహ్మద్ ఎంపికయ్యారు. అలాగే రైతు విభాగం అధ్యక్షుడిగా వెంకటేశ్వరరెడ్డి, సోషల్ మీడియా అధ్యక్షుడిగా షరీఫ్‌ను నియమించారు. వీరు పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి బుట్టా రేణుకకు కృతజ్ఞతలు తెలిపారు. వీరి ఎంపిక పట్ల పట్టణ అధ్యక్షులు నాగేశప్ప, జిల్లా చేనేత అధ్యక్షుడు శివప్రసాద్, విరుపాక్షిరెడ్డి, అల్తాఫ్, తారకరెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

నాయకులకు సన్మానం

నందవరం, జనవరి 23(ఆంధ్రజ్యోతి): నియోకవర్గ వైసీపీ యువజన విభాగం అధ్యక్షుడుగా నజీర్ అహ్మద్, రైతు విభాగ అధ్యక్షుడు సోమలగూడురు వెంకటేశ్వరరెడ్డి నియామకమయ్యారు. వారికి గురువారం నందవరం వైసీపీ మండల కన్వీనర్ శివారెడ్డిగౌడు, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు ముగతి విరుపాక్షిరెడ్డి, నాగేశప్ప, శివప్రసాద్, అల్తాఫ్, ముగతి తారకరెడ్డి సన్మానం చేశారు. ఇచ్చిన పదవులు న్యాయం చేయాలని ఆకాంక్షించారు.

బాధిత కుటుంబాలను శ్రీమఠం ఆదుకోవాలి


మఠం మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మంత్రాలయం జనవరి 23(ఆంధ్రజ్యోతి): బాధిత కుటుంబాలను శ్రీమఠం ఆదుకోవాలని జైభీమ్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు చిక్కం జానయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి హనుమన్న అన్నారు. బుధవారం మఠం మేనేజర్ వెంకటేశ్ జోషికి, తహసీల్దార్ రవి, డిప్యూటీ తహసీల్దార్ సరస్వతికి వినతిపత్రం సమర్పించారు. కర్ణాటకలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి చెందడం దుర దృష్టకరమన్నారు. ఇలాంటి సంఘటనలో మృతి చెందిన కుటుంబాలకు రాఘవేంద్ర స్వామి మఠం రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, గాయపడిన వారికి రూ.5 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు యోహాన్, రత్నం, నరసింహులు, సురేష్, నారాయణ, వెంకటేశ్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి: ఎంపీడీవో

నందవరం, జనవరి 23(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను అరికట్టే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎంపీడీవో పుల్లయ్య అన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో ఐసీడీఎస్ సిబ్బంది ఆధ్వర్యంలో కిశోర వికాస్ శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో పుల్లయ్య, సీడీపీవో సఫరున్నీసా బేగం మాట్లాడారు. 11 నుంచి 19 ఏళ్ల బాలికలపై శ్రద్ధ చూపాలని అన్నారు. బాల్య వివాహాలు జరగడం వల్ల కలిగే నష్టాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. బాల్య వివాహాలు చేసే వారి తల్లిదండ్రులకు ప్రత్యేకంగా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సందీప్, ఎపీఎం రాఘవేంద్ర, మండల సూపర్‌వైజర్లు సుచరిత, సుధావతి, నీలమ్మ, ప్రవీణ్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చేస్తే చర్యలు

కోసిగి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాలు చేస్తే చర్యలు తప్పవని ఐసీడీఎస్ సీడీపీవో ఎం.నాగమణి అన్నారు. గురువారం కోసిగి మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో కిశోరి వికాసం శిక్షణా కార్యక్రమం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో నాగమణి మాట్లాడుతూ బాల్యవివాహాలు చేయడం సాంఘిక దురాచారం, నేరమని, బాల్య వివాహాలు, బాలికల విద్య, రక్షణ ఆరోగ్యం, అభివృద్ధికి ఆటంకమే కాకుండా వారి కలలను సాకారం చేసుకునే అవకాశాలు దూరం చేస్తుందన్నారు. అనంతరం వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో వెంకటేశ్వర్లు, గ్రామ సర్పంచ్ కుమారి అయ్యమ్మ, పంచాయతీ కార్యదర్శి తిరుమలేశ్వరరెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నాగలక్ష్మి, విజయకుమారి, భాగ్యలక్ష్మి, కాత్యాయని, సచివాలయ సిబ్బంది, అనురాధ, రజిత, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

రెండో వార్డులో బోరు, ట్యాంక్ ఏర్పాటు

ఎమ్మిగనూరు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 2వ వార్డులో ఎమ్మెల్యే బీవి జయనాగేశ్వర రెడ్డి ఆదేశాలతో కొత్తగా బోరు, ట్యాంక్ ఏర్పాటు చేశారు. గురువారం వార్డు టీడీపీ నాయకులు తురేగల్ నజీరు, వాల్మీకి రాజు బోరు, ట్యాంక్‌కు పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వార్డు పర్యటన సందర్భంగా ఎమ్మెల్యే దృష్టికి నీటి సమస్యను తీసుకెళ్లడంతో ఎమ్మెల్యే బీవీ బోరు, ట్యాంక్ ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. దీంతో అధికారులు వెంటనే బోరు, ట్యాంక్ ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో బూతా రమేష్, నరసన్న, బుషప్ప, సరోజమ్మలు పాల్గొన్నారు.

రోజుకు రూ.300 కూలి ఇస్తాం : ఎంపీడీవో

మంత్రాలయం జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఉన్న ఊరిలోనే రోజుకు రూ.300 కూలి ఇస్తామని, ఎవరూ వలసలు వెళ్లవద్దని ఎంపీడీవో శోభారాణి అన్నారు. బుధవారం మండలంలోని రచ్చుమర్రి గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను ఏపీవో తిమ్మారెడ్డి, ఈసీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడుతూ వలసలు వెళ్లవద్దని, వారికి వచ్చే పని దినాలు, వారు చేస్తున్న పనులు, వస్తున్న కూలీ వంటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉపాధి అధికారులు ఇచ్చిన కొలతల ప్రకారం పనులు చేసుకుంటే రోజుకు రూ.300 వేతనం ఇస్తామన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ మరుధ్వతి, ఫీల్డ్ అసిస్టెంట్ మజ్జిగ బొజ్జప్ప, రవి, ఈరన్న, బొజ్జప్ప, బంగారయ్య, ఈరన్న పాల్గొన్నారు.

వైటీపీఎల్ నిర్వహణపై చర్యలు తీసుకోవాలి

ఎమ్మిగనూరు టౌన్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణంలోని యూత్ ఐకాన్స్ పేరిట ఐపీఎల్ తరహాలో వైటీపీఎల్ సీజన్ వన్ అనుమతులు ఇవ్వకూడదని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని స్థానిక సబ్ డివిజన్ కార్యాలయంలో డీఎస్పీ ఉపేంద్ర బాబుకు విద్యార్థి సంఘాల నాయకులు శేఖర్, ఉదయ్, మహేంద్ర బాబులు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫిబ్రవరి మొదటి వారం నుంచి పదో తరగతి, ఇంటర్, డిగ్రీ బోర్డు పరీక్షలు ప్రారంభం కానున్న తరుణంలో ఇలాంటి వైటీపీఎల్ లీగ్‌లు ఐపీఎల్ తరహాలో నిర్వహించడం విద్యార్థులపై తీవ్రప్రభావం చూపిస్తుందని అన్నారు. కానిస్టేబుల్, గ్రూప్-2 పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు ఆటంకంగా మారుతుందని తెలిపారు. ఇలాంటి లీగ్‌లు యువతను, విద్యార్థులను జూదానికి అలవాటు చేసే విధంగాను ఉన్నాయని, తక్షణమే వీటికి అనుమ


డీఎస్పీకి వినతిపత్రం ఇస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

తులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు నరసింహారెడ్డి, గోవర్ధన్, హరి, వీరారెడ్డి పాల్గొన్నారు.

దస్తగిరయ్య స్వామి ఉరుసు

గోనెగండ్ల, జనవరి 23(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెద్దమరివీడులో గురువారం దస్తగిరయ్యస్వామి ఉరుసు ఘనంగా జరుపుకున్నారు. దర్గాలలో స్వామి వారి సమాధిని పూలతో అలంకరించారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పలు గ్రామాల నుంచి భక్తులు పెద్దఎత్తున పాల్గొని మెక్కులు తీర్చుకున్నారు. స్వామివారి ఉరుసు కార్యక్రమానికి మండలంలోని పలు రాజకీయ పార్టీల నాయకులు హాజరై ప్రార్థనలు చేశారు. శుక్రవారం జియారత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

మంత్రాలయం అభివృద్ధికి కృషి

మంత్రాలయం జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం అభివృద్ధికి మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు విశేష కృషి చేస్తున్నారని మఠం ఏఏవో మాధవశెట్టి అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత నెలలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌లను పీఠాధిపతి కలిసి మంత్రాలయం అభివృద్ధికి సహకరించాలని కోరారని చెప్పారు. ప్రభుత్వం స్పందించి ఆర్టీసీ బస్టాండు అభివృద్ధి కోసం రూ.28.25 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా ఆర్‌అండ్‌బీ అధికారులతో సమావేశమై రోడ్ల అభివృద్ధిపై చర్చించారని వివరించారు.

జనసేన పార్టీని బలోపేతం చేస్తాం

మంత్రాలయం జనవరి 23(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో జనసేన పార్టీని బలోపేతం చేస్తామని ఇన్‌చార్జి బి.లక్ష్మన్న అన్నారు. గురువారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జనసేన పార్టీకి గాజు గ్లాస్ గుర్తును కేటాయించడం అభినందనీయమన్నారు. రాష్ట్రంలో లక్షలాది మంది జనసైనికులు పార్టీని పటిష్టం చేసేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. మంత్రాలయంలో వర్గవిభేదాలు లేకుండా ఐక్యంగా పని చేస్తూ జనసేన పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు బీవీ రవిచంద్ర, వెంకటేశ్, ఈరన్న, రాఘవేంద్ర పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కురుక్షేత్ర యుద్ధ నాటకం


నాటకంలోని ఓ సన్నివేశం

మంత్రాలయం జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి సన్నిధానంలో బెంగళూరుకు చెందిన శ్రీభగవాన్ బుద్ధ కళా సంఘం వారిచే కురుక్షేత్ర యుద్ధ పౌరాణిక నాటక ప్రదర్శన భక్తులను అలరించింది. గురువారం సాయంత్రం శ్రీమఠం యోగీంద్ర కళా మండపంలో దుర్యోధన, శ్రీకృష్ణుడు, ద్రౌపతి, ధర్మరాజు, పాండవులు, కర్ణుడు వంటి పాత్రలు భక్తులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజర్ వెంకటేశ్ జోషి, ఐపీ నరసింహమూర్తి, అనంతపురాణిక్, జేపీ స్వామి పాల్గొన్నారు. కళాకారులకు పీఠాధిపతి నగదు, మెమెంటో, ఫలపుష్ప మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు.

అధికారులు, సర్పంచ్‌ల మధ్య వాగ్వాదం

ఎమ్మిగనూరు రూరల్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన సర్పంచ్‌ల సమావేశంలో అధికారులు, సర్పంచుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. గురువారం ఎంపీడీవో సమావేశ భవనంలో ఎంపీడీవో బంగారమ్మ ఆధ్వర్యంలో సర్పంచుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఈవోపీఆర్డీ విజయలక్ష్మితో ఆయా గ్రామాల సర్పంచులు వాగ్వివాదానికి దిగారు. తాము గ్రామాల్లో అభివృద్ధి పనులు చేస్తున్న ఎందుకు బిల్లులు పెట్టడం లేదని మండిపడ్డారు. తాము ఎలా పనులు చేయాలని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఘనంగా నారా లోకేశ్ జన్మదిన వేడుకలు


కోసిగిలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు


మంత్రాలయంలో..

కోసిగి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): కోసిగిలోని రేణుకా ఎల్లమ్మ దేవి ఆలయంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి ఆదేశాల మేరకు జన్మదిన వేడుకలు నిర్వహించినట్లు మండల కన్వీనర్ జ్ఞానేష్ తెలిపారు. రేణుకా దేవి ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భారీ కేక్ కట్ చేశారు. టీడీపీ నాయకులు వక్రాణి వెంకటేశ్, మాజీ జడ్పీటీసీ తోవి రామకృష్ణ, నాడిగేని చిన్నతాయన్న, పైఇంటి నాగిరెడ్డి, వీరేష్, గాలెం వీరేష్, పోతుల వీరారెడ్డి, ఉప్పలపాటి అర్జున్, రామిరెడ్డి, వెంకటేశ్, రామాంజనేయులు, రంగారెడ్డి, గోపాల్, ఈశ్వర్ రెడ్డి ఉన్నారు.

గోనెగండ్ల: మండల కేంద్రమైన గోనెగండ్లలో రాష్ట్ర ఐటీ మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యద ర్శి నారాలోకేష్ జన్మదినవేడుకలను గురువారంత టీడీపీ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. టీడీపీ కార్యాలయాలలో పార్టీ నాయకులు కేక్ కట్ చేశారు. టీడీపీ నాయకులు బేతాలబడేసా, రామాంజినేయులు, అ డ్వకేట్ చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, బాబునాయుడు, మదీనా పాల్గొన్నారు.

మంత్రాలయం: మంత్రాలయంలో టీడీపీ నాయకులు మంత్రి నారా లోకేశ్ జన్మదిన వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. గురువారం నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి, ఆయన సోదరులు రఘునాథరెడ్డి, రామకృష్ణారెడ్డి, రాకేష్‌రెడ్డిలు మాధవరంలో కేక్ కట్ చేసి కార్యకర్తలతో సంబరాలు చేసుకున్నారు. అదేవిధంగా మంత్రాలయంలో రాఘవేంద్ర సర్కిల్‌లో టీడీపీ పట్టణ అధ్యక్షులు వరదరాజు, అశోక్ రెడ్డి, మేకల నరసింహులు, ఎంపీటీసీ మేకల వెంకటేశ్ కట్ చేసి బానా సంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. అనంతరం అనాథలకు పండ్లు, బెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జిల్లా అధికార ప్రతినిధి చావిడి వెంకటేశ్, మాజీ జడ్పీటీసీ లక్ష్మయ్య, చంద్ర, కంసాలి నరసింహ, రాజు, వడ్ల విజయకుమార్ పాల్గొన్నారు.

పెద్దకడుబూరు/ ఎమ్మిగనూరు రూరల్: మండల పరిధిలోని బసలదొడ్డి గ్రామంలో యువనేత ఐటీ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ జన్మదిన వేడుకలను టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. గురువారం నాయకులు గవిగట్టు రాజశేఖర్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాడెగల్ అయ్యప్ప, ఆంజినేయ, హనుమంతు, నరసప్ప, గోపాల్, యల్లప్ప, హనుమంతు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు మండలంలోని ఆయా గ్రామాల్లో ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు కేటీ వేంకటేశ్వర్లు, రాఘవేంద్ర, జగదీశ్ మాట్లాడుతూ యువతకు నారా లోకేశ్ ఒక ఆదర్శం అన్నారు.


గోనెగండ్లలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు


పెద్దకడుబూరు మండలం బసలదొడ్డి గ్రామంలో..